

మహిళలకు వడ్డీ వాపస్
● జిల్లాలోని ఎస్‌హెచ్‌జీలకు రూ.10.69 కోట్లు విడుదల
● మహిళా సంఘాల ఖాతాల్లో జమ చేసిన సర్కారు

దీక్షాదివస్‌ను విజయవంతం చేయాలి
బీఆర్ఎస్ అధ్యక్షుడు విద్యాసాగర్‌రావు
8

ఎన్నికల ఏర్పాట్లపై వీడియో కాన్ఫరెన్స్

జగిత్యాల, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ రాణి కుముదిని బుధవారం కలెక్టర్ సత్యప్రసాద్‌తో పాటు సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. హైదరాబాద్ నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌కు పట్టణంలోని కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కేంద్రంలో కలెక్టర్ సత్యప్రసాద్, ఎస్పీ అశోక్ కుమార్, అదనపు కలెక్టర్ రాజాగౌడ్ తదితరులు హాజరయ్యారు. పంచాయతీ ఎన్నికల నిర్వహణపై అధికారులకు రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ రాణి కుముదిని దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో ఎన్నికల సహాయకేంద్రం ప్రారంభం



సహాయ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ సత్యప్రసాద్

జగిత్యాల, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పంచాయతీ ఎన్నికల జరుగుతున్న నేపథ్యంలో సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్, ఎన్నికల సహాయ కేంద్రాన్ని బుధవారం కలెక్టర్ బి. సత్యప్రసాద్ ప్రారంభించారు. జగిత్యాల జిల్లాలో మూడు విడతల్లో ఎన్నికలు జరుగుతాయని, ఎన్నికలు జరిగే ప్రాంతాల్లో ఏవైనా సమస్యలుంటే టోల్ ఫ్రీ నెంబర్ 9666 234383ను సంప్రదించాలని సూచించారు. నిరంతరం సేవల కోసం సిబ్బంది అందుబాటులో ఉంటారని తెలిపారు. జిల్లా నోడల్ అధికారులుగా జిల్లా సంక్షేమ శాఖ అధికారి బోనగిరి నరేష్, జిల్లా పౌరసంబంధాల అధికారి పి. నరేష్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వి. భాస్కర్‌లను నియమించారని తెలిపారు. అధికారులకు సలహాలు, సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా నోడల్ ఆఫీసర్లు బోనగిరి నరేష్, పి. నరేష్ పాల్గొన్నారు.

అధికారులు సమయపాలన పాటించాలి

జడ్పీ సీఈవో గౌతమ్‌రెడ్డి



జగిత్యాల అర్బన్ ఎంపీడీవో కార్యాలయాన్ని తనిఖీ చేస్తున్న జడ్పీ సీఈవో గౌతమ్‌రెడ్డి

జగిత్యాలరూరల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): అధికారులు సమయ పాలన పాటించాలని జగిత్యాల జడ్పీ సీఈవో గౌతమ్‌రెడ్డి అన్నారు. బుధవారం జగిత్యాల అర్బన్ మండల ప్రజాపరిషత్ కార్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా కార్యాలయ రికార్డులు పరిశీలించారు. సర్పంచ్ ఎన్నికల నిర్వహణకు సంసిద్ధంగా ఉండాలని, ఎన్నికల విజయవంతంగా పూర్తి చేయాలని సూచించారు. అధికారులు విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో విజయలక్ష్మీ, సూపరింటెండెంట్లు చౌదారపు గంగాధర్, శ్రీనివాస్, సీనియర్ అసిస్టెంట్ ప్రసాద్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నూతన లేబర్‌కోడ్‌లు రద్దు చేయాలి




కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న సీఐటీయూ నాయకులు

జగిత్యాల అర్బన్, నవంబర్ 26 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని కోరుతూ సీఐటీయూ, ఏఐటీయూసీ, ఐఎన్టీయూసీ, ఐఎఫ్‌టీయూ, ఏఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో బుధవారం జగిత్యాల కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి చింత భూమేశ్వర్ మాట్లాడుతూ స్వాతంత్రానికి పూర్వం బ్రిటిష్ పాలనలో భారత కార్మిక వర్గం అనేక పోరాటాలు ప్రాణ త్యాగాలు చేసి హక్కులను, చట్టాలను సాధించుకున్నదని, కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత 29 కార్మిక చట్టాలను కార్పోరేటర్‌లకు అనుకూలంగా సవరణలు చేసిందని విమర్శించారు. కార్మికులకు ఉపయోగపడే అంశాలను నిర్వీర్యం చేసిందని, సంఘం పెట్టుకునే హక్కును, ఉద్యోగ భద్రతను, కార్మిక వర్గానికి దూరం చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కార్మిక నాయకులు ఎండీ ముఖ్రం, నామ లక్ష్మీ, ఎండీ మోహినొద్దీన్ తదితరులు పాలొన్నారు.

నామినేషన్లకు వేళాయె..

- తొలి విడతలో 122 పంచాయతీలు, 1,172 వార్డులకు ఎన్నికలు
- నేటి నుంచి 29వ తేదీ వరకు స్వీకరణ
- పల్లెల్లో వేడెక్కుతున్న రాజకీయం
- 2,20,147 మంది తొలి విడత ఓటర్లు



జగిత్యాల, నవంబరు26 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల సమరానికి అంతా సిద్ధమైంది. రాష్ట్ర ఎన్నికల సంఘం జారీ చేసిన షెడ్యూల్ మేరకు మూడు విడతలుగా సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలకు ఎన్నికలు నిర్వహించనున్నారు. గురువారం నుంచి తొలి విడత నామినేషన్ల పర్వం మొదలు కానుంది. డిసెంబరు 11వ తేదీన పోలింగ్ నిర్వహించి అదే రోజు కౌంటింగ్ నిర్వహణ, సాయంత్రం వరకు ఫలితాలు ప్రకటిస్తారు. ఈ మేరకు ఎన్నికల నిర్వహణకు యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది.

మొదటి విడత షెడ్యూల్ ఇలా..

మొదటి విడత నామినేషన్లను ఈనెల 27వ తేదీ నుంచి 29వ తేదీ వరకు సాయంత్రం 5 గంటల వరకు స్వీకరించనున్నారు. 30వ తేదీన నామినేషన్ల పరిశీలన, చెల్లుబాటు అయిన నామినేషన్ల ప్రకటన, వచ్చే నెల 1వ తేదీ వరకు అప్పీల్, 2వ తేదీన అప్పీల పరిష్కారం, 3వ తేదీ వరకు నామినేషన్ల ఉపసంహరణ, పోటీలో ఉన్న అభ్యర్థుల ప్రకటన, 11వ తేదీన ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పోలింగ్ నిర్వహించనున్నారు. అదే రోజు మధ్యాహ్నం 2 గంటల నుంచి కౌంటింగ్ ప్రారంభించి ఫలితాలను ప్రకటించనున్నారు.

మండలం	జీపీలు	వార్డులు	పోలింగ్ కేంద్రాలు	ఓటర్లు
మేడిపల్లి	1	120	120	24,251
భీమారం	13	118	118	17,577
కథలాపూర్	19	188	188	37,724
కోరుట్ల	15	152	152	31,243
మెట్‌పల్లి	23	212	212	36,866
ఇబ్రహీంపట్నం	17	162	162	31,383
మల్లాపూర్	23	220	220	41,103
మొత్తం	122	1,172	1,172	2,20,147

ముహూర్తాలు చూస్తున్న అభ్యర్థులు..

పంచాయతీ ఎన్నికల్లో భాగంగా సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలకు పోటీచేసే అభ్యర్థులు నామినేషన్లు వేసేందుకు ముహూర్తాలను, జాతకాలను చూసుకుంటున్నారు. ఈ మూడు రోజుల్లో కలిసి వచ్చే రోజును తెలుసుకొని నామినేషన్ల వేసేందుకు సిద్ధమవుతున్నారు. పం చాయతీ ఎన్నికలు పార్టీలకతీతంగా జరుగుతున్నప్పటికీ ప్రధాన రాజకీయ పక్షాలు తమ పార్టీకి చెందిన నేతలను బరిలో దింపి మద్ద తు ఇవ్వడంపై దృష్టి సారించాయి. ఆయా పంచాయ తీల్లో పార్టీలు అభ్యర్థుల ఎంపిక ప్రక్రియను వేగవంతం చేశాయి. గెలిచే అభ్యర్థులను ఎంపిక చేసి మద్దతు పలికే పనిలో నిమగ్నమయ్యాయి.

పకడ్బందీగా ప్రవర్తన నియమావళి అమలు

రాష్ట్ర ఎన్నికలసంఘం పంచాయతీ మిగతా 8లో

ఎన్నికలకు అంతా సిద్ధం...



సత్యప్రసాద్, కలెక్టర్

జిల్లాలో పంచాయతీ ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. మొదటి విడతగా ఏడు మండలాల్లో ఎన్నికలు జరుగుతాయి. నోటిఫికేషన్ విడుదలతోనే నామినేషన్ల స్వీకరణ మొదలవుతుంది. ఇందుకొరకు అవసరమైన ప్రాంతాల్లో రిటర్నింగ్ అధికారులు, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు, ఇతర సిబ్బందిని నియమించాం. ఎన్నికల విధులపై వారికి పలు దఫాలుగా శిక్షణ ఇచ్చాం.

జైన ప్యాక్స్ కార్యదర్శి సస్పెన్షన్

జగిత్యాల, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు అంశంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన జిల్లాలోని ధర్మపురి మండలం జైన ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యదర్శి బి. సాగర్‌రావును సస్పెండ్ చేస్తూ జిల్లా సహకార అధికారి మనోజ్ కుమార్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇటీవల జైన పాక్స్ పరిధిలోని దమ్మన్నపేట ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా అదనపు కలెక్టర్, జిల్లా పౌరసరఫరాల అధికారి తనిఖీ చేయగా కేంద్రం నిర్వాహకులు రైస్ మిల్లులకు పంపే ధాన్యం, ట్రక్ షీట్ వివరాల అంశంలో సెంటర్ నిర్వాహకులు అవకవతవకలకు పాల్పడినట్లు గుర్తించారు. ధాన్యం కొనుగోలు కేంద్రం నిర్వాహకున్ని ఇప్పటికే తొలగించగా, పాక్స్ కార్యదర్శిని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

రేపు జిల్లా స్థాయి చెకుముకి టాలెంట్ టెస్ట్

జగిత్యాల అగ్రికల్చర్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఏటా నిర్వహించే చెకుముకి టాలెంట్ టెస్ట్ ఈ నెల 28న జగిత్యాల జిల్లా కేంద్రంలోని స్థానిక నలంద డిగ్రీ కళాశాలలో నిర్వహిస్తున్నట్లు చెకుముకి జిల్లా కోఆర్డినేటర్ తులసీ ఆగమయ్య తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు పరీక్ష ఉంటుందన్నారు. కావున మండల స్థాయిలో ద్వితీయ స్థానాలు పొందిన అన్ని యాజమాన్య పాఠశాలల నుంచి విద్యార్థులు హాజరు కావాలని కోరారు.

కలెక్టర్‌ను కలిసిన అదనపు ఎస్పీ

జగిత్యాల, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్‌ను బుధవారం అదనపు ఎస్పీ శేషాద్రినిరెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. జిల్లాలో ఇటీవల నూతనంగా బాధ్యతలు చేపట్టిన శేషాద్రిని రెడ్డి పట్టణంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో కలెక్టర్ సత్యప్రసాద్‌ను కలిసి పూల మొక్క అందించారు. ఈ సందర్భంగా శేషాద్రినిరెడ్డికి కలెక్టర్ అభినందనలు తెలిపారు.

విత్తన చట్టంపై అవగాహన

కథలాపూర్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సిరికొండలో బుధవారం మండల వ్యవసాయాధికారిణి యోగిత 2025 విత్తన చట్టం ముసాయిదాపై రైతులు, విత్తన డీలర్లకు అవగాహన కల్పించారు. ఈ ప్రతిపాదిత చట్టం ద్వారా నాణ్యమైన విత్తనాలు మరియు నర్సరీ మొక్కలు, నాణ్యతను సరైన విధంగా నియంత్రించాలని ఉద్దేశించిందన్నారు. రైతుల హక్కులను పూర్తిగా రక్షించాలనే ఉద్దేశంతో ఈ చట్టాన్ని తీసుకురావడం జరిగిందని పేర్కొన్నారు. ఈ చట్టాన్ని పార్లమెంట్‌లో ఆమోదించడానికి వీలుగా రైతులు, డీలర్లతో సమావేశాలు నిర్వహిస్తున్నట్టు వివరించారు.

యాదవులు రాజ్యాధికారం వైపు అడుగులు వేయాలి

రాయికల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): యాదవులు రాజ్యాధికారంవైపు అడుగులు వేయాలని యాదవ సంఘం జగిత్యాల జిల్లా వ్యవస్థాపక అధ్యక్షుడు గనవేని మల్లేష్ యాదవ్ అన్నారు. రాయికల్ మండల కేంద్రంలో బుధవారం యాదవ సంఘం సభ్యుల సమావేశం నిర్వహించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో యాదవులు సాధ్యమైనంత మేరకు ఎక్కువ స్థానాల్లో పోటీ చేసి యాదవులు రాజ్యాధికారంవైపు అడుగులు వేయాలని సూచించారు. అనంతరం కొత్తపేట రాజరాజేశ్వరస్వామి దేవాలయ కమిటీ చైర్మన్‌గా నియామకమైన దానవేని రాము యాదవ్‌ను శాలువాలతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రెబ్బాసు మల్లన్న యాదవ్, లాల్యావుల రాజన్న యాదవ్, ఆసరి మల్లేష్, కాసవేని రాజేష్, దానవేని సతీష్, మహేందర్, మల్లారెడ్డి, మల్లేష్, రాజేష్, గోనె వంశీ, రెబ్బాసు శేఖర్ పాల్గొన్నారు.

రాజ్యాంగ స్ఫూర్తితో సమర్థవంతమైన సేవలు అందిద్దాం

ఎస్పీ అశోక్ కుమార్



ప్రతిజ్ఞ చేస్తున్న ఎస్పీ అశోక్‌కుమార్, అదనపు ఎస్పీ శేషాద్రినిరెడ్డి, పోలీసులు

జగిత్యాల టౌన్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి):ప్రపంచంలో అతి పెద్ద లిఖిత రాజ్యాంగంగా భారత రాజ్యాంగానికి ప్రపంచ దేశాలలో ఎంతో గుర్తింపు ఉందని, మనమంత రాజ్యాంగ స్ఫూర్తితో పని చేస్తూ ప్రజలకు మరింత సమర్థవంతమైన సేవలందించాలని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ పేర్కొన్నారు. భారత రాజ్యాంగం అమోదించి 76 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా జగిత్యాల జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో రాజ్యాంగా దినోత్సవాన్ని పోలీసులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ భారత రాజ్యాంగం మన దేశ ప్రజా స్వామ్యానికి మూలాధారం అని న్యాయం, సమానత్వం, స్వేచ్ఛ, సౌభ్రా తృత్వం అనే మౌలిక సూత్రాలను ప్రతి ఒక్కరూ పాటించాలన్నారు. భారత రాజ్యాంగం ద్వారా దేశంలోని ప్రజలందరికీ ప్రాథమిక హక్కులను కల్పించడంతో పాటు ప్రజల ప్రయోజనాలే లక్ష్యంగా చట్టాలను సైతం పొందుపరిచారని తెలిపారు. అనంతరం జిల్లా ఎస్పీ పోలీసు అధికారులు, సి బ్బందితో రాజ్యాంగ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ శేషాద్రినిరెడ్డి, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్‌లు కిరణ్ కుమార్, వేణు, సైదులు, ఆర్ ఎస్ఐలు డీపీఓ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికల విధుల్లో అప్రమత్తంగా ఉండాలి

కలెక్టర్ సత్యప్రసాద్



మాట్లాడుతున్న కలెక్టర్ సత్యప్రసాద్

జగిత్యాల, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల విధులలో ఉద్యో గులు, అధికారులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్ సూచించారు. బుధవారం పట్టణంలోని కలెక్టరేట్ కార్యాలయంలో గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణపై రిటర్నింగ్ అధికారులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లాలో జరుగనున్న గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల నిర్వహణ, నామినేషన్ పత్రాలకు సంబంధించి రిటర్నింగ్ అధికారులకు, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులకు పలు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. రాజగౌడ్, జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి ఆర్డీవోలు మధుసుధన్, జివాకర్‌రెడ్డి, శ్రీనివాస్, జిల్లా నోడల్ అధికారులు, జిల్లా ఎన్నికల విభాగం, అధికారులు పాల్గొన్నారు.

నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి

గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణను పూర్తి శాంతియుత వాతావరణంలో నిర్వహించుటకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ తెలిపారు. బుధవార కలెక్టరేట్‌లో గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణపై జిల్లా ఎస్పీ అశోక్ కుమార్, డిప్యూటి ఎస్పీ శేషాద్రిని రెడ్డి, అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) బి. రాజ గౌడ్, జిల్లా నోడల్ అధికారులతో కలిసి జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్ ప్రెస్ మీట్ నిర్వహించారు. గ్రామ పంచాయతీ ఎన్నికలను 3 విడుతలలో నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల కమిషన్ షెడ్యూల్ నిన్న సాయంత్రం ప్రెస్ రిలీజ్ చేసిందని తెలిపారు. డిసెంబరు 11న మొదటి విడత, డిసెంబర్ 14న రెండో విడత, డిసెంబరు 17న మూడవ విడత పంచాయతీ ఎన్నికల పోలింగ్ జరగనున్నట్లు తెలిపారు.

ప్రశాంతంగా జరిగేందుకు అందరూ సహకరించాలి

జిల్లాలో పంచాయతీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు అందరు సహకరించాలని జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ కోరారు. బుధవారం జిల్లా కలెక్టరేట్‌లో మిని సమావేశ హాల్ లో ఏర్పాటు చేసిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్, జిల్లా ఎస్పీ అశోక్ కుమార్‌లతో పాల్గొని సూచనలు చేశారు. గ్రామ పంచాయతీ ఎన్నికల కోడ్ నియమావళిని పాటించాలన్నారు. గ్రామ పంచాయతీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఎన్నికల నిబంధనలు అమలులో ఉన్నందున రాజకీయ పార్టీలకు సంబంధించిన గోడ రాతలు, వాల్ పోస్టర్, ఫ్లెక్సీ బ్యానర్లు తొలగించాలని సూచించారు. సమావేశంలో డిప్యూటీ ఎస్పీ శేషాద్రిని రెడ్డి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. రాజగౌడ్, జిల్లా నోడల్ అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు, జిల్లా ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.

ధాన్యం తూకాన్ని వెంటనే చేపట్టాలి

రాయికల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ధాన్యం తూకాన్ని వెంటనే చేపట్టాలని మాజీ మంత్రి జీవన్‌రెడ్డి అధికారులను కోరారు. మండలంలోని కట్కాపూర్ గ్రామంలో గత ఆరు రోజుల నుంచి వరిధాన్యం తూకం వేయడం లేదని జీవన్‌రెడ్డికి దృష్టికి తీసుకురాగా బుధవారం ఆయన సందర్శించారు. ఉన్నతాధికారులతో ఫోన్‌లో మాట్లాడి ధాన్యం తూకం వేయకుంటే రైతుల పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. అధికారుల లోపంతో ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుందని అన్నారు. తూకం ఆగిపోవడంతో కూలీలు వెళ్లేలా ఉన్నారని అవసరమైతే వేరే మిల్లుకు తరలించాలని అధికారులకు సూచించారు.

వైభవంగా మల్లికార్జున స్వామి జాతర

గొల్లపల్లి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మల్లన్నపేట శ్రీ మల్లికార్జున స్వామి జాతర ఉత్సవాల్లో భాగంగా స్వామి వారి దండివారం కార్యక్రమాన్ని ఆలయ పూజారుల వేద మంత్రోచ్ఛరణల నడుమ మంగళవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు పెద్ద ఎత్తున భక్తులు ఊరేగింపుగా తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. స్వామివారికి బోనాలు సమర్పించారు. ఒగ్గు పూజారుల ఆధ్వర్యంలో మల్లన్న పట్నాలు వేసి ప్రత్యేక మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ పూజారులు కొండూరి రాజేంధర్ శర్మ, కొండూరి రఘునందన్ శర్మ వేదమంత్రోచ్ఛరణల నడుమ స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. సుమారు 18 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకోగా, ప్రత్యేక దర్శనానికి విక్రయించిన టికెట్ల ద్వారా ఆలయానికి రూ. 84,860 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఫౌండర్ ట్రస్టీ కొండూరి శాంతయ్య తెలిపారు. ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఉత్సవాలను ఏఎంసీ చైర్మన్ భీమ సంతోష్, ఆలయ ఈవో విక్రమ్, ఆలయ ఫౌండర్ ట్రస్టీ కొండూరి శాంతయ్య పర్య వేక్షించారు. డీఎస్పీ రఘుచందర్, సీఐలు రాంనర్సింహారెడ్డి, నీలం రవి, ఎస్సైలు కృష్ణాసాగర్ రెడ్డి, ఉదయ్ కుమార్, మహేష్, సతీష్, బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో రవీందర్ రావు, ఆలయ ఈవో విక్రమ్, మాజీ ప్రజా ప్రతినిధులు సిద్దంకి నర్సయ్య, గోస్కుల రాజన్న, భేర కిషోర్, బీఆర్ఎస్వీ మండల శాఖ అధ్యక్షులు ఆవారి చందు, నాయకులు పాల్గొన్నారు.



ఆలయం చుట్టూ బోనాలతో ప్రదక్షిణలు చేస్తున్న భక్తులు

ఆంధ్రజ్యోతి లో మీ శ్రేయస్సు కోరే వారికి అందించండి...
పదవీ విరమణ శుభాకాంక్షలు



మీ ఆత్మీయులలో..
మీ సహోద్యోగులలో...
మీ కుటుంబ సభ్యులలో...
ఎవరైనా రిటైర్ అవుతున్నారా ?
అందిస్తుంది సులువైన మార్గం పదవీ విరమణ ప్రకటనలకు
25%
రాయితీ కల్పిస్తుంది
అలాంటి వారు తమ విధి నిర్వాహణలోని అనుభవాలు, సలహాలు, సూచనలు ఇచ్చి మీ అభివృద్ధికి మార్గదర్శకులై ఉంటారు. అయితే వారికి తీపి గుర్తుగా, మీ అమూల్యమైన కానుకగా ఆంధ్రజ్యోతి ద్వారా అందించండి... పదవీ విరమణ శుభాకాంక్షల అక్షర సుమాంజలులు...
ఆంధ్రజ్యోతి కార్యాలయం
ప్రకటనల విభాగము
ప్రకటనలకై సంప్ర: 99854 11174
కరీంనగర్ సెల్ : 99854 11278, 99859 21353, 97036 18691, 99854 10640, జగిత్యాల సెల్: 99854 11262 ,
మెట్‌పల్లి సెల్: 70131 42966, వేములవాడ, సిరిసిల్ల సెల్: 99854 11063

ఆంధ్రజ్యోతి CLASSIFIEDS

పేరు మార్పు
★ నేను నాజెం మమత తండ్రి: నాజెం పెద్దపోశెట్టి, ఇ.నెం. 2-68/1, తిమ్మాపూర్, ఇబ్రహీంపట్నం మండలం, జగిత్యాల జిల్లా, తెలంగాణ-505450, అనే నేను వివాహం తరువాత నా పేరును బోడ తరుణి భర్త: వెంకటేష్‌గా మార్చుకున్నాను.
AJK-17488

CHANGE OF NAME
★ I, "SIRIMALLE BHASKAR" S/O. SIRUMALLA HANUMANTHU, R/O. H.NO: 8-52, MALKAPUR, KARIMNAGAR. I HAVE CHANGED NAME AS "SIRUMALLA BHASKAR" S/O. SIRUMALLA HANUMANTHU.
AJK-17487

CHANGE OF NAME
★ I, "SIRIMALLE HANMANTHU" S/O. SIRUMALLA ANJAIAH, R/O. H.NO: 8-52, MALKAPUR, KARIMNAGAR. I HAVE CHANGED NAME AS "SIRUMALLA HANUMANTHU" S/O.SIRUMALLA ANJAIAH.
AJK-17487

CHANGE OF NAME
★ I,"GUDA LAKSHMI" W/O. GUDA RAGHAVA REDDY, R/O. H.NO: 8-3-216/12, FLAT NO-304, PAVAN MALLAREDDY RESIDENCY, BHAGATH NAGAR, KARIMNAGAR. I HAVE CHANGED NAME AS "GUDA LAXMI" W/O. GUDA RAGHAVA REDDY.
AJK-17487

పేరు మార్పు
★ నేను బండి సదానందం సాయన్న S/o. బండి సాయన్న, ఇంటి నెం. 12-8, ఇబ్రహీంపట్నం, జగిత్యాల జిల్లా. ఇక్కడ ప్రకటిస్తున్నాను. బండి సదానందం సాయన్న మరియు బండి సాయన్న రెండూ ఒకటే వ్యక్తి అని. ఇకపై అన్ని అవసరాల కోసం నా పేరు బండి సదానందంగా పరిగణించబడుతుంది
AJK-17487

పాఠకులకు ముఖ్య గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన/క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు.
పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడీవీటీ

3+2 స్కీం కలదు

ఆంధ్రజ్యోతి ప్రకటనలకై సంప్ర: 99854 11174

ఆంధ్రజ్యోతిలో క్లాసిఫైడ్ ప్రకటనలకై సంప్రదించండి
కరీంనగర్ :- సెల్ : 9703618691, 9985410640
జగిత్యాల, మెట్‌పల్లి :- సెల్ : 9985411262
వేములవాడ, సిరిసిల్ల :- సెల్: 9985411063

విదేశీ ఉద్యోగం పేరుతో మోసం

● నిందితుడికి మూడు సంవత్సరాల జైలు శిక్ష

ఇల్లంతకుంట, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): విదేశీ ఉద్యోగం పేరుతో మోసం చేసిన ఎర్రవెల్లి భూమయ్యకు న్యాయస్థానం మూడు సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు రూ. 1500 జరిమానా విధించినట్లు ఎస్సై సిరిసిల్ల అశోక్ తెలిపారు. ఎస్సై వివరాల ప్రకారం.. గాలిపెల్లి గ్రామానికి చెందిన బట్టు ఎల్లయ్య ఉపాధికోసం విదేశాలకు వెళ్లాలని భావించాడు. వల్లంపట్ల గ్రామానికి చెందిన భూమయ్య ఉపాధికోసం ఇరాక్ పంపిస్తానని రూ. 71వేలు తీసుకొని దుబాయ్‌కి టూరిస్టు వీసాపై పంపాడు. అక్కడికి వెళ్లిన తర్వాత రెండునెలలకే ఎల్లయ్యను అక్కడి ప్రభుత్వం భారతదేశానికి తిరిగి పంపించింది. మోసపోయానని గ్రహించిన బాధితుడు తన డబ్బులు తిరిగి ఇవ్వాలని డిమాండ్ చేశాడు. దీనితో భూమయ్య ప్రామిసరీ నోట్ రాసి ఇచ్చాడు. ఎన్నిసార్లు అడిగినా డబ్బులు ఇవ్వకపోవడంతో ఎల్లయ్య అతని భార్య లక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించి కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. న్యాయస్థానంలో కోర్టు కానిస్టేబుల్ తిరుపతి సాక్ష్యం ప్రవేశపెట్టగా పీపీ విక్రాంత్ కేసు వాదించారు. నేరం రుజువు కావడంతో సిరిసిల్ల రెండవ అదనపు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు నిందితుడికి మూడు సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు జరిమానా విధించినట్లు ఎస్సై తెలిపారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని ఒకరి మృతి


అలిశెట్టి మహేష్(ఫైల్)

సిరిసిల్ల రూరల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల అర్బన్ పరిధిలోని పెద్దబోనాల శివారులోని రెండో బైపాస్ రోడ్డులో మంగళవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒక వ్యక్తి మృతిచెందాడు. పెద్దూర్ శివారులోని డబుల్ బెడ్‌రూం సముదాయంలో నివాసం ఉంటున్న అలిశెట్టి మహేష్(40) వేములవాడ పట్టణంలోని టెంట్‌హౌజ్‌లో పనిచేస్తూ ప్రతి రోజు ఇంటికి వచ్చిపోతుండేవాడు. మంగళవారం ఉదయం పనికి వెళ్లిన మహేష్ రాత్రి 11 గంటలైనా ఇంటికి రాకపోవడంతో ఫోన్ చేయగా వస్తున్నానని చెప్పాడని భార్య భవ్యశ్రీ తెలిపింది. అర్ధరాత్రి సమయంలో వేములవాడ నుంచి సిరిసిల్లకు వచ్చిన మహేష్ బైపాస్ రోడ్డులో నడుచుకుంటూ పోతుండగా వెనుకనుంచి గుర్తు తెలియని వాహనం మహేష్ పైనుంచి పోవడంతో అక్కడికక్కడే చనిపోయాడు. బుధవారం తెల్లవారుజామున వాహనాదారులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్ఐ సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్ట్‌మార్టం కోసం జిల్లా ఆసుపత్రికి తరలించారు. మృతుడి భార్య భవ్యశ్రీ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ప్రభుత్వ కార్యాలయాలు ఎక్కడో?

- డివిజన్ స్థాయి ఆఫీసులు దొరకక ఇబ్బందులు
- చాలా వరకు అద్దె భవనాల్లో కొనసాగుతున్న వైనం
- ఏటా లక్షల్లో అద్దె చెల్లింపు.. అయినా వసతుల కొరత


శిథిలావస్థలో కొనసాగుతున్న వేములవాడ పశువైద్యశాల

శిథిలావస్థకు చేరడంతో వేరే చోటకు మార్చిన ఇరిగేషన్ కార్యాలయం

వేములవాడ, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): వేములవాడ మండలం డివిజన్‌గా రూపాంతరం చెంది ఏళ్లు గడుస్తున్నా ప్రభుత్వ కార్యాలయాలు ఎక్కడ ఉన్నాయి..? సంబంధిత డివిజనల్ స్థాయి ప్రభుత్వ అధికారులు ఎవరు అనేది పూర్తిగా ప్రజలకు తెలియకుండా పోయింది. వేములవాడ పట్టణంతో పాటుగా ఆయా పనుల నిమిత్తం డివిజన్ కేంద్రానికి వచ్చే ప్రజలు కార్యాలయాలు ఎక్కడున్నాయో తెలియక ఇబ్బందులు పడుతున్నారు.

● **శిథిలావస్థలో కొన్ని కార్యాలయాలు..**

వేములవాడ మండల పరిషత్ ఆవరణలో మండల స్థాయి ప్రభుత్వ కార్యాలయాలు నిర్మించి సుమారుగా 40 ఏళ్లు కావస్తోంది. దీంతో ఆయా కార్యాలయాలు శిథిలావస్థలో దర్శనమిస్తున్నాయి. ఇరిగేషన్ కార్యాలయం పూర్తిగా శిథిలావస్థకు చేరడంతో కార్యాలయం ఎక్కడ ఏర్పాటు చేశారనే సమాచారం ప్రజలకు అందడం లేదు. ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయం, వేములవాడ రూరల్ తహసీల్దార్, పశువైద్యశాల కార్యాలయాలు వర్షకాలం ఉరుస్తుండడంతో ఫైల్స్, కంప్యూటర్‌లు తడుస్తున్నాయని, రూరల్ మండలం పరిషత్ కార్యాలయం జడ్పీ భవన్‌లో, ఆర్డీవో కార్యాలయం పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో, ఏడీఏ కార్యాలయం వ్యవసాయ మార్కెట్‌లో, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు అరకొర వసతుల మధ్య కొనసాగుతున్నాయి.

● **అద్దె భవనాల్లోనే కొనసాగింపు..**

వేములవాడ పట్టణంలోని కొన్ని ప్రభుత్వ కార్యాలయాలు ఇప్పటికీ అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి. మండల పరిషత్ ఆవరణలోని గతంలో నిర్మించిన ప్రభుత్వ కారాల్యయాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. దీంతో మరికొన్ని ఇరుకు సందుల్లో, సరైన చిరునామా లేకపోవడంతో నియోజకవర్గ ప్రజలు తీవ్ర అసహనానికి గురువుతున్నట్లు తెలుస్తోంది.సరైన వసతులు లేకప్రజలు సతమతమవుతున్నారు. ప్రభు త్వం ఏటా లక్షల్లో ప్రజాధాన్ని అద్దెల రూపంలో చెల్లిస్తున్న ప్పటికీ ప్రజలకు మాత్రం ఇబ్బందులు తప్పడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఆర్డీవో కార్యాలయం, ఎక్సైజ్ శాఖ, ఐసీడీఎస్, తపాలా, సబ్ రిజి స్ట్రార్, నీటి పారుదల శాఖతో పాటు పలు ముఖ్యమైన కార్యాలయాలు అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఇరుకు సందులో ఉండటంతో కార్యాలయానికి నిత్యం వందల సంఖ్యలో వచ్చే ప్రజలు వాహనాలు పార్కింగ్ లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

డీఈలను కలవాలంటే సిరిసిల్లకు వెళ్లాలి..

\- కోల కృష్ణస్వామి, వేములవాడ పట్టణం



వేములవాడ డివిజన్‌గా ఏర్పడి సంవత్సరాలు గడుస్తుంది. ఇప్పటి వరకు ఏ కార్యాలయాలు ఎక్కడ ఉన్నాయో ప్రజలకు స్పష్టంగా తెలియదు. డీఈల కోసం కార్యాలయాల చుట్టు తిరగాల్సి వస్తోంది. వేములవాడలోని కార్యాలయాలకు వెళితే సిరిసిల్లకు వెళ్లి కలవమంటున్నారు.

సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి..

\- చిలుక అంజిబాబు, చందుర్తి



వేములవాడ డివిజనల్ ప్రభుత్వ కార్యాలయాలు ఎక్కడ ఎన్నాయో తెలువడం లేదు. చందుర్తి మండలం నుంచి ఆయా పనుల కోసం వేములవాడ మండల పరిషత్ ఆవరణకు వస్తారు. కొన్ని కార్యాలయాలు శిథిలావస్థకు చేరడంతో అద్దె భవనంలో కొనసాగుతున్నాయి. వాటి వివరాలతో ఎక్కడ, ఏ కాలనీలో ఉన్నాయో ప్రజలకు తెలిసేలా సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి. ప్రభుత్వం దృష్టి సారించి పక్క భవనాలు నిర్మించాలి.

ఒకరి ఆత్మహత్య

బీర్‌పూర్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి):మానసిక వ్యాధితో బాధపడుతూ జీవితంపై విరక్తి చెంది తుంగూర్ గ్రామానికి చెందిన వెయ్యినూరి చంద్రయ్య(37)అనే వ్యక్తి ఫ్యాన్‌కు ఉరి వేసుకొని మృతి చెందినట్లు ఎస్సై రాజు తెలిపారు. చంద్రయ్య ఆరు సంవత్సరాల నుండి మానసిక వ్యాధితో బాధపడుతున్నాడు. జీవితంపై విరక్తి కలిగి ఇంటిలో ఎవరు లేని సమయంలో బుధవారం ఫ్యాన్‌కు ఉరి వేసుకొని మృతి చెందాడని మృతుడి భార్య వెయ్యినూరి నర్మద ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గుర్తు తెలియని మహిళ మృతి


మహిళ మృతదేహం

కోరుట్ల, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): కోరుట్ల పట్టణంలోని కల్లూర్ రోడ్డులో బుధవారం ఉదయం ఓ నిర్మాణంలో ఉన్న ఇంటి ఎదుట గుర్తు తెలియని మహిళ అపస్మారక స్థితిలో పడిపోయి ఉన్నట్లు స్థానికులు గుర్తించారు. ఆ మహిళను ప్రత్యేక వాహనం ద్వారా పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించే ప్రయత్నం చేసి పోలీసులకు సమాచారం అందించారు. మార్గమధ్యలో మహిళ మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. మహిళ మృతదేహంను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి మార్చరీలో పరిచినట్లు ఎస్ఐ చిరంజీవి తెలిపారు. మహిళ సుమారు 55 నుంచి 60 సంవత్సరాల వయస్సు ఉంటుందని తెలిపారు. మహిళ బ్లూ కలర్ చీర జాకిట్ ధరించి ఉన్నట్లు ఎస్సై తెలిపారు. సమచారం తెలిసిన వారు కోరుట్ల ఎస్ఐ 8712656790, సీఐ 8712656820, బ్లూకోర్టు పోలీసు ఫోన్. 9502318200 నంబర్‌లో సంప్రదించాలని ఎస్ఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో బాలిక మృతి.. బంధువుల ఆందోళన

కొడిమ్యాల, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): కొడిమ్యాల మండల కేంద్రానికి చెందిన తిప్పరవేని మధుశ్రీ(11) అనే బాలిక విద్యుదాఘాతంతో మంగళవారం రాత్రి మృతి చెందింది. మండల కేంద్రంలోని శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి గుట్టపైకి మెట్ల మార్గానికి ఆలయ కమిటీ వారు విద్యుత్ లైట్లను ఏర్పాటు చేశారు. కింది మెట్ల వద్ద స్నేహితులతో ఆడుతున్న మధుశ్రీకి ప్రమాదవశాత్తు విద్యుత్ వైర్లు తగిలి కింద పడి అపస్మారక స్థితిలోకి వెళ్లింది. గమనించిన కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించేలోపు బాలిక మృతి చెందింది. తమకు న్యాయం చేయాలని బాలిక బంధువులు బుధవారం ఆలయం ఎదుట రోడ్డుపై బైఠాయించి ఆందోళనకు దిగారు.


ఆందోళన చేస్తున్న బంధువులు


మధుశ్రీ(ఫైల్)

మల్యాల సీఐ నీలం రవి, కొడిమ్యాల ఎస్సై ఎస్. సందీప్ ఆలయం ఎదుట బైఠాయించిన వారిని సముదాయించారు. ఆలయ కమిటీ నిర్లక్ష్యం కారణంగానే విద్యుత్ ప్రమాదం జరిగిందని ఆందోళనకారులు ఆరోపించారు. ప్రభుత్వ పరంగా మృతురాలి కుటుంబానికి సహాయం అందే విధంగా సహకరిస్తానని సీఐ, ఎస్సై హామీ ఇచ్చారు. విద్యుత్ ప్రమాదానికి కారణమైన వారిపై కేసు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వటంతో కుటుంబ సభ్యులు, బందువులు ఆందోళన విరమించారు. మృతురాలి తండ్రి తిప్పరవేని నాగరాజు ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు. మధుశ్రీ ఒక ప్రైవేటు పాఠశాలలో ఐదో తరగతి చదువుతోంది.

వేర్వేరు కారణాలతో ఇద్దరి ఆత్మహత్య

బోయినపల్లి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : వివిధ కారణాలతో ఓ వృద్ధురాలు, మరోవ్యక్తి ఆత్మహత్య చేసుకున్నట్లు బోయినపల్లి ఎస్సై రమాకాంత్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మండంలోని కొదురుపాక గ్రామానికి చెందిన అంజయ్య(58) అనే వ్యక్తి ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకోగా, వెంకట్రావుపల్లి గ్రామంలో నల్లాల లక్ష్మి నర్సవ్వ(74) వ్యవసాయ బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు. ఆత్మహత్యలకు గల కారణాలు తెలియరాలేదు.

ప్రమాదానికి కారణమైన నిందితుడికి జైలు శిక్ష

జగిత్యాల టౌన్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): జగిత్యాల పట్టణంలో జరిగిన రోడ్డు ప్రమాదం కేసులో అజాగ్రత్తగా వాహనం నడిపి ప్రమాదానికి కారణమైన నిందితుడు అడువాల నరేష్‌కు న్యాయమూర్తి శ్రీనిజ కొహిర్కర్ నాలుగు నెలల జైలు శిక్షతో పాటు రూ. 200 జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. జగిత్యాల పట్టణానికి చెందిన షేక్ ఫజల్ రహమాన్ జులై30, 2020న రాత్రి ద్విచక్ర వాహనంపై ఉప్పరిపేట నుంచి జగిత్యాలకు వస్తుండగా స్వప్న దాబావద్ద జగిత్యాల నుంచి చల్‌గల్ వైపు ద్విచక్ర వాహనంపై వెళ్తున్న అడువాల నరేష్ అతివేగంగా వచ్చి ఫజల్ రహమాన్‌ను ఢీకొట్టాడు. ఈ ఘటనలో బాధితుడికి తీవ్ర గాయాలు కావడంతో మొదట జగిత్యాల ప్రభుత్వాసుపత్రికి, అనంతరం మెరుగైన చికిత్స కోసం కరీంనగర్‌కు తరలించారు. బాధితుడి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పటి ట్రాఫిక్ ఎస్ఐ అనిల్ కేసు నమోదు చేసి, విచారణ జరిపి ఛార్జ్‌షీట్ దాఖలు చేశారు. విచారణలో సాక్ష్యాధారాలు పరిశీలించన న్యాయమూర్తి నిందితుడికి 4 నెలల జైలు శిక్ష, రూ.200 జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో దంపతుల మృతి

● కూతురుకు తీవ్రగాయాలు

వేములవాడ టౌన్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ అర్బన్ మండలం ఆరేపల్లి గ్రామం వద్ద ద్విచక్రవాహనాన్ని లారీ బుధవారం సాయంత్రం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనంపై వెళుతున్న దంపతులు అబ్దుల్ వసీం(27), ఐఫా (22) అక్కడికక్కడే మృతిచెందగా, వారి రెండేళ్ల కూతురు కాలు విరిగి తీవ్రగాయాలయ్యాయి. వేములవాడ పట్టణ సీఐ వీరప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దపల్లి జిల్లా రామగుండంకు చెందిన వసీం జీవనోపాధి కోసం కుటుంబ సభ్యులతో కరీంనగర్‌లో నివాసం ఉంటున్నారు. సిరిసిల్లలో ఆదివారం జరిగే ఐఫా సోదరి పెళ్లికి హాజరయ్యేందుకు ద్విచక్ర వాహనంపై కరీంనగర్ నుంచి వెళుతుండగా, సిరిసిల్ల నుంచి కరీంనగర్ వైపు వెళుతున్న లారీ ఢీకొట్టింది. ఈ ఘటనలో ద్విచక్రవాహనంపై ఉన్న భార్యభర్తలు వసీం, ఐఫా అక్కడికక్కడే మృతిచెందారు. వారి కూతురు కాలు విరిగి తీవ్రగాయాలు కావడంతో చికిత్స కోసం కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని, లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నట్లు సీఐ తెలిపారు.

కొడుకుపై విచక్షణారహితంగా దాడి

● సోషల్‌మీడియాలో వైరల్

● కేసు నమోదు చేసిన పోలీసులు


కొడుకుపై దాడి చేస్తున్న రాజయ్య

మల్యాల, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): తల్లిని తరచూ ఎందుకు తిడుతున్నావని అడిగిన కొడుకుపై తండ్రి కర్రతో విచక్షణారహితంగా దాడి చేశాడు. ఈ ఘటన మల్యాల మండలం బల్వంతాపూర్, సర్వాపూర్ గ్రామాల మధ్య గల కొండపోచమ్మ ఆలయం వద్ద జరిగింది. తండ్రి రాజయ్య దాడి చేసిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. మల్యాలకు చెందిన అయితరవేని రాజయ్య, భార్య మల్లవ్వ మధ్య మనస్పర్థలు రాగా కొన్నేళ్లుగా విడివిడిగా ఉంటున్నారు. మల్లవ్వ తన తల్లిగారిల్లు బల్వంతాపూర్‌లో కొడుకు గణేశ్‌తో ఉంటున్నది. సోమవారం బల్వంతాపూర్ శివారులోని పోచమ్మ ఆలయం వద్ద రాజయ్యను తన తల్లిని ఎందుకు తిడుతున్నావని కొడుకు అడుగడంతో తండ్రి కర్రతో దాడి చేశాడు. ఆ దృశ్యాలు సోషల్‌మీడియాలో రెండు రోజులుగా చక్కర్లు కొట్టగా గణేశ్ బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో రాజయ్యపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై నరేశ్‌కుమార్ తెలిపారు.

ఆర్టీసీ బస్సుపై తెగిపడిన విద్యుత్ వైరు

జగిత్యాల టౌన్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా కేంద్రంలోని కొత్త బస్టాండ్ సర్కిల్ వద్ద ఆర్టీసీ బస్సుపై విద్యుత్ సర్వీస్ వైరు తెగిపడింది. బస్సులో ఉన్న ప్రయాణికులకు పెను ప్రమాదం తప్పింది. నిర్మల్ డిపోకు చెందిన పల్లె వెలుగు ఆర్టీసీ బస్సు బుధవారం ఉదయం నిర్మల్ నుంచి ఖానాపూర్, మల్లాపూర్, రాయికల్ మీదుగా జగిత్యాలకు చేరుకుంది. కొత్త బస్టాండ్ చౌరస్తా సమీపంలో విద్యుత్ సర్వీస్ వైరు తెగి ఆర్టీసీ బస్సుపై పడింది. గమనించిన డ్రైవర్ హుటాహుటిన బస్సును నిలిపివేసి ప్రయాణికులను దింపివేశాడు. అనంతరం విద్యుత్ అధికారులకు సమాచారం అందించగా వారు విద్యుత్ సరఫరా నిలిపివేశారు. తెగిన విద్యుత్ వైరును తొలగించి బస్సును బస్టాండ్‌లోకి తీకుకెళ్లారు.

వావిలాలపల్లిలో ఇంట్లోకి చొరబడిన నక్క

కరీంనగర్ క్రైం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ వావిలాలపల్లిలో మంగళవారం రాత్రి అడవి జంతువు నక్క తప్పిపోయి ఒక ఇంటిలోకి చొరబడింది. అటవీ ప్రాంతం నుంచి ఎలా తప్పిపోయిందో తెలియదు కాని ఆ నక్క నేరుగా వావిలాలపల్లిలోని కటకం సునీల్‌రావు ఇంటి ఆవరణలోకి ప్రవేశించింది. రాత్రంతా ఆయన ఇంటిలోని ఆవరణ, స్నానాల గదిలోనే ఉంది. బుధవారం ఉదయం నక్కను చూసేందుకు స్థానికులు రాగా వారి అలికిడితో ఇంటిలో నుంచి బయటకు పారిపోయింది. నక్క శాతవాహన విశ్వవిద్యాలయం గుట్ట ప్రాంతం, రేకుర్తి, మల్కాపూర్ గుట్టల ప్రాంతాల నుంచి వచ్చి ఉంటుందని భావిస్తున్నారు. నక్కలు ఎక్కువగా కోళ్లు, పక్షులను ఆహారంగా తీసుకుంటాయి. ఆహారం వెదుకుతూ దారితప్పిపోయి పట్టణంలోకి ప్రవేశించి ఉంటుందని అటవీశాఖ అధికారులు చెబుతున్నారు.


వావిలాలపల్లిలో ఓ ఇంటి వద్ద ఉన్న నక్క

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

కరీంనగర్ క్రైం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ రూరల్ మండలం చెర్లబూత్కూర్ గ్రామంలోని ఒక వ్యవసాయ బావిలో గుర్తుతెలియని వ్యక్తి(40-45) మృతదేహం మంగళవారం లభ్యమైందని కరీంనగర్ రూరల్ సీఐ ఏ నిరంజన్‌రెడ్డి తెలిపారు. మృతుడిని గుర్తించినవారు కరీంనగర్ రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి ఫోన్. 8712670764, ఎస్ఐ టి నరేష్ ఫోన్. 8712574753, ఎస్ఐ లక్ష్మారెడ్డి ఫోన్ 9000884443లో సమాచారం అందించాలని కోరారు. మృతుడు ఫుల్ టీ షర్ట్, బ్యాగీ ప్యాంట్, బూం బూట్లు ధరించి ఉన్నాడని తెలిపారు.

బెల్ట్‌షాపు నిర్వాహకుల బైండోవర్

కరీంనగర్ క్రైం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ రూరల్ మండలంలో బెల్ట్‌షాపులు నిర్వాహకులతో పాటు పాత నేరస్థులను బుధవారం బైండోర్ చేశామని కరీంనగర్ రూరల్ సీఐ ఏ నిరంజన్‌రెడ్డి తెలిపారు. మొగ్ధుంపూర్, తీగలగుట్టపల్లి, చామనపల్లి గ్రామాలకు చెందిన శివసాయి, రవి, శ్రీనాథ్, పర్శరాం, భూమయ్య, శ్రీనివాస్‌లను కరీంనగర్ రూరల్ తహసీల్దార్ ఎదుట హాజరుపరచి లక్ష రూపాయల స్వంత పూచీకత్తుపై బైండోవర్ చేసినట్లు సీఐ తెలిపారు. రూరల్ మండలంలో బెల్ట్‌షాపులు నడిపితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సీఐ నిరంజన్‌రెడ్డి హెచ్చరించారు.

శ్రీరాంసాగర్‌లో నిలకడగా నీరు

జగిత్యాల, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్‌లోకి ఎగువ ప్రాంతాల నుంచి బుధవారం స్వల్పంగా నీరు వస్తోంది. దీంతో డ్యామ్‌లో నీరు నిలకడగా ఉంది. ఎగువ ప్రాంతం నుంచి ప్రాజెక్టులోకి 1,338 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 80.501 టీఎంసీలు కాగా అంతే స్థాయి నీటి మట్టంతో ప్రాజెక్టు నిండుకుండలా ఉంది. ప్రాజెక్టులోకి ఈ యేడాది జూన్ 1వ తేదీ నుంచి ఇప్పటి వరకు 948.052 టీఎంసీల నీరు వచ్చి చేరగా, ప్రాజెక్టు నుంచి 880.339 టీఎంసీల నీరు దిగువకు వదిలారు.

ఫుట్‌బాల్ ఆడుతూ గాయపడిన విద్యార్థి

\- చికిత్స పొందుతూ మృతి

పెద్దపల్లిటౌన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని రంగంపల్లికి చెందిన పదవతరగతి విద్యార్థి కనవేన ప్రతీక్(14) మంగళవారం స్కూల్‌లో ఫుట్‌బాల్ ఆడుతూ గాయపడ్డాడు. వెంటనే అతన్ని ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. వివరాల్లోకి వెళితే.. పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని పెదపల్లి, చీకురాయి రోడ్డులోని ఓ ప్రైవేట్ స్కూల్‌లో ప్రతీక్ పదో తరగతి చదువుతున్నాడు. పాఠశాలలో మంగళవారం ఆటల పీరియడ్‌లో ఫుట్‌బాల్ ఆడుతుండగా ప్రమాదవశాత్తు కిందపడి పోయాడు. కొద్దిసేపటికి వాంతులు చేసుకున్నాడు. దీంతో అతన్ని వెంటనే ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో అక్కడి నుంచి కరీంనగర్‌కు తరలించారు. అక్కడి వైద్యులు ప్రతీక్ తలలో రక్తం గడ్డకట్టిందని తెలిపారు. ఈ క్రమంలో అక్కడే చికిత్సపొందుతూ రాత్రి 11గంటలకు ప్రతీక్ మృతి చెందాడు. ప్రతీక్ తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

ప్రతీక్ రెండు కళ్లు దానం

ప్రతీక్ ప్రమాదశాత్తు మరణించగా అతని కళ్లను దానం చేసేందుకు తండ్రి ఒప్పుకున్నారు. ప్రతీక్ తండ్రి కుమారస్వామి అతడి రెండు కళ్లను ఎల్వీ ప్రసాద్ ఆసుపత్రికి దానం చేస్తామని తెలిపాడు. లయన్స్ క్లబ్‌కు సంబంధించిన నిపుణులు ప్రతీక్ కళ్లు సేకరించి ఎల్వీప్రసాద్ ఆస్పత్రికి పంపించారు.

గుప్త నిధుల కోసం వేట

● స్వామిజీ వేషంలో ప్రజలను మోసం చేస్తున్న ముగ్గురి అరెస్ట్ ● సీఐ వెంకటేశ్వర్లు



నిందితుల అరెస్ట్ చూపుతున్న పోలీసులు

కోనరావుపేట, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): గుప్త నిధులు ఉన్నాయని, వాటిని తీసే నెపంతో డబ్బులు కాజేసి స్వామిజీ వేషంతో మోసం చేస్తున్న ముగ్గురిని బుధవారం అరెస్టు చేసి రిమాండ్ తరలించగా, మరొకరు పరారీలో ఉన్నట్లు చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. కోనరావుపేట మండలం నిజామాబాద్ గ్రామానికి చెందిన దుగ్గు వేణు ఇంటికి పెద్దూరు గ్రామానికి చెందిన మేకల నరేష్ స్వామిజీ వేషంతో వచ్చి మీకు మంత్రాలు చేశారని, నయం చేస్తానని చెప్పి యంత్రం కట్టి 3 వేల రూపాయలు తీసుకున్నాడు. మళ్లీ స్వామిజీ వేషంలో వచ్చిన నరేష్ పెద్ద మొత్తంలో డబ్బులు తీసుకోవాలని ప్లాన్ ప్రకారం మీ ఇంటిలో గుప్త నిధులు ఉన్నాయని, తనకు తెలిసిన బాబాను పిలిపించి నిధులు తీస్తానని నమ్మబలికాడు. దీంతో వేణు నమ్మి మరో 50 వేల రూపాయలు ఇచ్చాడు. డబ్బులు కాజేసిన నరేష్‌తో పాటు పెద్దూరు గ్రామానికి చెందిన కడవంచ ప్రసాద్, చంద్రంపేటకు చెందిన సదుల దేవేందర్ కలిసి వేణు ఇంటికి వచ్చి రాత్రిపూట పూజలు చేసినట్లు నటించి నిధి కోసం తవ్వినట్లు చేసి అందులో వెంట తెచ్చుకున్న విగ్రహం కనిపించేలా చేసి ఆ విగ్రహాన్ని వెంటనే మూసేశారు. ఇంటిలో నాగబంధం ఉందని, ఇలానే తవ్వితే ప్రాణం నష్టం కలుగుతుందని నమ్మించారు. ఆ నిధిని తీయడానికి అఘోరాలను పిలిపించాలని మరో మూడు లక్షల 40 వేల రూపాయలు ఖర్చు అవుతాయని, సగంలో ఆపేస్తే ఇబ్బందులు కలుగుతాయని బెదిరించారు. భయపడ్డ వేణు అందుకు ఒప్పుకుని మూడు లక్షల 40 వేల రూపాయలు ఇచ్చాడు. దీంతో ఆ ముగ్గురు కలిసి చంద్రంపేటకు చెందిన సదుల రాజేశం అనే మరొక వ్యక్తిని అఘోరీ వేషం వేయించుకొని రాత్రిపూట ఇంటికి వచ్చి పూజలు నిర్వహించి గుప్త నిధుల కోసం వేట ప్రారంభించినట్లు నటించారు. నిధుల కోసం తవ్వుతుండగా అందులో నుంచి వారి వెంట తెచ్చుకున్న కోరలు తీసిన నాగుపాము వచ్చి కాటేసినట్లుగా చేసి కాటేసిన వ్యక్తి నురగలు తీస్తున్నట్లు నటిస్తూ హాస్పిటల్ తరలించాలని వేణుని బెదిరించగా మరో 15 వేల రూపాయలు ఇచ్చి ఆసుపత్రికి తర లించినట్లు సీన్ క్రియేట్ చేశారు. అప్పటి నుంచి నరేష్ మరో ముగ్గురు వ్యక్తులు కనిపించక పోవడంతో ఆచూకీ తెలుసుకొని పెద్దూర్ గ్రామంలో ఉంటున్న నరేష్‌ను తన డబ్బులు తిరిగి ఇవ్వాలని అడగగా డబ్బులు ఇవ్వనని బెదిరించాడు. దీంతో వేణు కోనరావుపేట పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసుకొని ఎస్సై ప్రశాంత్‌రెడ్డి దర్యాప్తు ప్రారంభించారు. నిజామాబాద్ శివారులో ముగ్గురిని పట్టుకొని వారి వద్ద నుంచి మూడు లక్షలు స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించగా, రాజేశం పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఎస్సై ప్రశాంత్‌రెడ్డి, పోలీస్ సిబ్బందిని సీఐ వెంకటేశ్వర్లు అభినందించారు.

కొట్టుకుపోయి.. ప్రమాదకరంగా మారి..


ప్రమాదకరంగా మారిన వాగుపై రహదారి

ఎల్లారెడ్డిపేట, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఎల్లారెడ్డిపేట మండలం పదిర గ్రామ శివారులోని మానేరు వాగు ఉధృతికి సీసీ రహదారి కొట్టుకుపోయింది. ఎల్లారెడ్డిపేట, ముస్తాబాద్ మండలాలకు రాకపోకలు సాగించే రోడ్డు ధ్వంసమైంది. వరద ప్రవాహం తగ్గడంతో సీసీ శిథిలాలు వాగులో తేలాయి. రహదారి ప్రమాదకరంగా మారింది. వాహనదారులు అదుపు తప్పి గాయాలకు గురవుతున్నారు. మరమ్మతులు చేయాల్సిన అధికారులు పట్టించుకోకపోవడం వల్ల ఆసుపత్రుల పాలవుతున్నామని వాహనదారులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వాగుపై ఉన్న రహదారికి మరమ్మతులు చేసి ప్రమాదాలను అరికట్టాలని కోరుతున్నారు.

భీమన్న సన్నిధిలో భద్రత పటిష్టం

- అదనంగా 12మంది స్పెషల్ పోలీసుల కేటాయింపు
- నోడల్ అధికారిగా స్పెషల్ బ్రాంచి ఎస్ఐకి బాధ్యతలు



హోంగార్డులతో మాట్లాడుతున్న ఈవో రమాదేవి

వేములవాడ టౌన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వరస్వామి దేవస్థానం విస్తరణ నేపథ్యంలో భీమేశ్వరాలయంలో భక్తుల రద్దీకి అనుగుణంగా భద్రతను పటిష్టం చేశారు. రాబోయే మేడారం సమ్మక్క, సారలక్క జాతర సందర్భంగా వేములవాడకు లక్షలాది భక్తులు వచ్చి స్వామివారికి మొక్కులు చెల్లించడం ఆనవాయితీ అయినందున రద్దీకి అనుగుణంగా భద్రత చర్యలు చేపట్టారు. నోడల్ అధికారిగా స్పెషల్ బ్రాంచి ఎస్ఐ రాజ్‌కుమార్‌కు అదనపు బాధ్యతలు ఇచ్చారు. ఇతను 30మంది పోలీస్ ఫోర్స్‌తో సిద్ధంగా ఉంటారు. వీరేకాకుండా ప్రతి సోమ, శుక్ర, ఆదివారాల్లో వేములవాడ టౌన్ పోలీస్ స్టేషన్ నుంచి సీఐ, ఇద్దరు ఎస్ఐలు నిరంతరం భద్రతా చర్యల్లో భాగస్వాములవుతారు. ఇప్పటికే 10 ప్లస్ 2 స్పెషల్ పోలీస్ ఫోర్స్(ఎస్‌పీఎఫ్) ఆలయ భద్రతలో పాలుపంచుకుంటుంది. ప్రస్తుతం భీమేశ్వరాలయంలో భక్తుల దర్శనాలు కొనసాగడంతో అదనంగా పోలీస్ ఫోర్స్ కావాలని లేఖ రాయడంతో అదనంగా 12మంది స్పెషల్ పోలీస్ ఫోర్స్‌ను కేటాయిస్తూ ఆదేశాలు ఇచ్చారు. వీరంతా షిఫ్ట్‌ల వారీగా ఆలయ భద్రతా విధుల్లో ఉంటారు. వీరే కాకుండా రాజన్న ఆలయానికి 36మంది హోంగార్డులను కేటాయించారు.

హోంగార్డులకు ఈవో సూచనలు

భీమేశ్వరాలయంలో విధులు నిర్వహించే హోంగార్డులకు ఆలయ ఈవో ఎల్. రమాదేవి బుధవారం పలు సూచనలు చేశారు. హోంగార్డులు నిర్వహించే ప్రాంతాల్లో తప్పకుండా కనిపించాలని, భక్తులకు సహాయం మాత్రమే చేయాలని, ఎలాంటి దర్శనాలకు, ప్రలోభాలకు పాల్పడవద్దని హెచ్చరించారు. ఎవరైనా దర్శనాలకు వెళ్లాలనుకుంటే నేరుగా కలిస్తే ఏర్పాట్లు చేస్తామని సూచించారు.

కూరగాయల సాగుకు ప్రోత్సాహం

- రైతులకు రాయితీ ఇస్తున్న రాష్ట్ర ప్రభుత్వం
- సద్వినియోగం చేసుకోవాలంటున్న అధికారులు



హుజూరాబాద్‌రూరల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): కూరగాయల సాగు విస్తీర్ణం పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ప్రోత్సాహం అందిస్తోంది. కూరగాయల నారు, శాశ్వత పందిళ్లు, మల్చింగ్, ప్రథమ శ్రేణి ప్రదర్శన క్షేత్రం, ట్రెల్లిసింగ్‌కు(ఊతం)ల కోసం పలు రాయితీలు ఇస్తున్నది. మండలవ్యాప్తంగా 90 ఎకరాల్లో మాత్రమే కూరగాయల పంటలను సాగు చేస్తున్నారు.

శాశ్వత పందిళ్లు

బీర, కాకర వంటి తీగజాతి కూరగాయల సాగు కోసం శాశ్వత పందిళ్ల నిర్మాణానికి 50 శాతం రాయితీ ఇస్తున్నారు. ఒక యూనిట్‌కు రాయితీ రూ.50 వేలు (విస్తీర్ణం అర ఎకరం) ఐదు యూనిట్ల వరకు రైతుకు అవకాశం ఉంటుంది.



రాంపూర్ గ్రామంలో కూరగాయల పంటను పరిశీలిస్తున్న ఉద్యానవన శాఖాధికారులు

మల్చింగ్‌తో ఉపయోగాలు

కూరగాయల సాగులో కలుపు సమస్యను అధిగమించడానికి తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడి సాధించడానికి మల్చింగ్ ఉపయోగపడుతుంది. ఎకరానికి రూ. 8 వేల వరకు రాయితీ ఉంటుంది. ఒక రైతు 5 ఎకరాల వరకు రాయితీ పొందవచ్చు.

అంటు మొక్కలకు రాయితీ

భూమి ద్వారా సంక్రమించే వివిధ తెగుళ్లు, చౌడు నేలలకు తట్టుకుని అధిక దిగుబడి ఇచ్చే అంటు మొక్కల(వంగ)కు ప్రభుత్వం ఎకరానికి రూ. 30 వేల వరకు రాయితీ ఇస్తుంది. పరిమితి ఒక ఎకరం.

ట్రెల్లిసింగ్ (ఊతం)

ట్రెలిస్లింగ్ విధానంలో టమాట ఇతర కూరగాయల పంటలు సాగు చేయడానికి ఎక రానికి రూ. 10 వేల రాయితీ సదుపాయం కల్పించబడింది. రాయితీ ఒక ఎకరానికి మాత్రమే పరిమితం. దీంతో పాటు బిందు సేద్యానికి ఎస్సీ, ఎస్టీలకు 90 శాతం, ఇతరులకు 80 శాతం, తుంపర్ల సేద్యానికి 75 శాతం రాయితీ ఉంది. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఉద్యానవన శాఖాధికారులు కోరుతున్నారు.

కూరగాయలకు రాయితీ

టమాట, వంగ, పచ్చి మిరప, క్యాబేజి, క్యాలీఫ్లవర్ వంటి కూరగాయల నారుపై ప్రభుత్వం రైతులకు వందశాతం రాయితీ ఇస్తుంది. కావాల్సిన నారు కోసం రైతులు సిద్దిపేట జిల్లాలోని ములుగు సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో సంప్రదిస్తే ఉచితంగా పెంచి ఇస్తారు. అందుకు రైతులు పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్, బ్యాక్ అకౌంట్ జిరాక్స్ పత్రాలతో 30 రోజుల ముందు ఉద్యానవన శాఖాధికారిణి కలవాలి.

రాయితీలను సద్వినియోగం చేసుకోవాలి



- మంజువాణి, మండల ఉద్యానవనశాఖాధికారి, హుజూరాబాద్

రైతులు కూరగాయల సాగుపై ఆసక్తి చూపాలి. ఇక్కడి రైతులు ఉద్యానవన పంటలను చాలా తక్కువ విస్తీర్ణంలో సాగు చేస్తున్నారు. కూరగాయల సాగు చేస్తే ఉద్యాన శాఖ నుంచి ఎక్కువ మొత్తంలో రాయితీలు వస్తున్నాయి. రైతులు వాటిని సద్వినియోగం చేసుకుని లాభాలు పొందాలి.

రాజన్న హుండీ ఆదాయం రూ. 94.29లక్షలు

వేములవాడ టౌన్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయ హుండీ ఆదాయం రూ.94.29లక్షలు సమకూరింది. బుధవారం భీమేశ్వరసదన్ పై అంతస్తులో ఆలయ హుండీలను లెక్కించారు. 94.20లక్షల నగదు, 67.500 గ్రాముల బంగారం, 4కిలోల వెండిని భక్తులు కానుకలుగా సమర్పించారని ఆలయ ఈవో ఎల్. రమాదేవి తెలిపారు. ఈ హుండీల లెక్కింపులో కరీంనగర్ సహాయ కమిషనర్ కార్యాలయ పరిశీలకులు రాజమౌళి, ఏఈవోలు, పర్యవేక్షకులు, ఆలయ సిబ్బంది, శివరామకృష్ణ భజనమండలి సేవా సమిత సభ్యులు పాల్గొన్నారు.

కార్మిక చట్టాలన్నీ అమలు చేయాలి

పాలకుర్తి, వంబరు 26 (ఆంధ్రజ్యోతి): కేంద్రప్రభుత్వం 21 నవంబరు 2025నుంచి 29కార్మిక చట్టాల స్థానంలో అమలుచేసిన 4లేబర్ కోడ్లను రద్దుచేసి 29చట్టాలను యథావిధంగా అమలులోకి తీసుకురావాలని బుధవారం పౌరహక్కుల సంఘం ఉమ్మడి కరీంనగర్‌జిల్లా కమిటీ ఓ పత్రిక ప్రకటనలో డిమాండ్ చేసింది. పౌరహక్కుల సంఘం ఉమ్మడి కరీంనగర్ జిల్లా కమిటీ అధ్యక్షుడు బొంకూరి లక్ష్మణ్, పౌరహక్కుల సంఘం ఉమ్మడి కరీంనగర్ జిల్లా కమిటీ ప్రధానకార్యదర్శి బొడ్డుపల్లి రవి ఆ ప్రకటనలో పలు అంశాలను పేర్కొన్నారు. ప్రభుత్వం కుట్రపూరితంగా చట్టాలను కోడ్లుగా మార్చి కార్మికులకు అందనీయకుండా చేస్తుందని ఆరోపించారు. నాలుగు కోడ్లను నిలువరించి కార్మికచట్టాలను అమలు చేసుకోవాలన్నారు.

రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ బాస్కెట్‌బాల్ పోటీలు ప్రారంభం

కరీంనగర్ స్పోర్ట్స్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి):జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ స్టేడియంలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ అండర్-17 బాస్కెట్ బాల్ పోటీలను డీఈవో శ్రీరాం మొండయ్య బుధవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పోటీల నిర్వహణ కార్యదర్శి బి.వేణుగోపాల్, రాష్ట్ర ఎస్‌జీఎఫ్ పరిశీలకులు కౌముదిని పాల్గొన్నారు.

మట్టి తరలిస్తున్న వారిపై కేసు

శంకరపట్నం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం మెట్‌పల్లిలో అక్రమంగా మట్టి తరలిస్తున్న వారిపై కేసు నమోదైంది. మెట్‌పల్లికి చెందిన అంతడుపుల మహేందర్, తోట సతీష్ అక్రమంగా జేసీబీ, ట్రాక్టర్ ద్వారా మట్టి రవాణా చేస్తుండగా పట్టుకొని, కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శేఖర్‌రెడ్డి తెలిపారు.

నాణ్యతా లోపంతోనే కూలిన చెక్‌డ్యామ్

పెద్దపల్లి ఎమ్మెల్యే సీహెచ్ విజయరమణారావు



మాట్లాడుతున్న పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు

కరీంనగర్ అర్బన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట మండలం గుంపుల-తనుగుల మధ్యన మానేరు వాగులోని చెక్‌డ్యామ్ నాణ్యతా, డిజైన్ లోపంతో కూలిపోయిందని పెద్దపల్లి ఎమ్మెల్యే సీహెచ్ విజయరమణారావు అన్నారు. బుధవారం కరీంనగర్ ఆర్అండ్‌బీ అతిథిగృహంలో విలేకరులతో మాట్లాడారు. చెక్‌డ్యాంను పేల్చివేసినట్లు నిరూపిస్తే తాను రాజకీయాల నుంచి తప్పుకుంటానని, కుంగిపోయిందని నిరూపిస్తే మీరు రాజకీయాల నుంచి తప్పుకుంటారా? అని మాజీ మంత్రి హరీ్‌షరావుకు సవాల్ విసిరారు. బీఆర్ఎస్ హయాంలో అవినీతితోనే ఆ చెక్ డ్యామ్ కూలిందన్నారు. లోతు నుంచి నిర్మాణం జరపకుండా, ఇసుకపై చెక్‌డ్యాం నిర్మించినందునే కొట్టుకుపోయిందన్నారు. చెక్‌డ్యాంను కూల్చివేశారంటూ మాజీ మంత్రి హరీ్‌షరావు దుష్ప్రచారం చేస్తున్నారని, అబద్ధాలను నిజంలా నమ్మించడంలో ఆయన దిట్టని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కరీంనగర్ నుంచి మల్హర్ మండలం వరకు సుమారు రూ.300 కోట్లు వెచ్చించి 23 చెక్ డ్యామ్‌లు నిర్మించారని, వారి ప్రభుత్వంలోనే 8 చెక్ డ్యామ్‌లు కూలిపోయాయని అన్నారు. కేవలం ఇసుక కోసమే చెక్ డ్యామ్‌లు నిర్మించిందని ఆరోపించారు. కేసీఆర్, కేటీఆర్, హరీ్‌షరావు కమీషన్‌ల కోసం అవినీతికి పాల్పడ్డారన్నారు. తేదీ ఖరారు చేస్తే... బీఆర్ఎస్ హయాంలో కూలిన చెక్ డ్యామ్‌లు చూపిస్తానన్నారు. ఇసుక మాఫియా కాదు, కేసీఆర్ కుటుంబం ఇసుక దొంగలు అన్నారు. ఇదే ఇసుక దొంగలు రాజన్న సిరిసిల్ల జిల్లా నేరెళ్ల బాధితులపై థర్డ్ డిగ్రీ ప్రయోగించి దళితులను జైలుకు పంపించారన్నారు. దోచుకున్న సొమ్ము కోసమే కేసీఆర్ కుటుంబ సభ్యులు గొడవ పడుతూ రోడ్డున పడుతుతున్నారన్నారు. ప్రస్తుత మంత్రి పొంగులేటి శ్రీనివా్‌సరెడ్డికి చెక్‌డ్యాం కాంట్రాక్టు వచ్చినప్పుడు బీఆర్ఎస్ పార్టీలోనే ఉన్నారని ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. సమావేశంలో సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, అర్బన్ బ్యాం క్ చైర్మన్ కర్ర రాజశేఖర్, మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్, హుజురాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఒడితెల ప్రణవ్ బాబు, ఏఎంసీ చైర్మన్ ప్రకాశ్‌రావు, మాజీ జెడ్‌పీటీసీ సారయ్యగౌడ్, గర్రెపల్లి సత్యనారాయణ, జాని, కాశెట్టి శ్రీనివాస్, ఆకుల నర్సయ్య తదితరులున్నారు.

చింతకుంటలో ఎస్‌జీఎఫ్ సాఫ్ట్‌బాల్ పోటీలు



మాట్లాడుతున్న ప్రధానోపాధ్యాయులు టి శోభారాణి

భగత్‌నగర్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి మండలం చింతకుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఎస్‌జీఎఫ్ అండర్-17 సాఫ్ట్ బాల్‌పోటీలను ప్రధానోపాధ్యాయులు శోభారాణి ప్రారంభించారు. ఉమ్మడి జిల్లా నుంచి 300 మంది బాలబాలికలు పోటీలకు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో జిల్లా పాఠశాలల క్రీడా సమాఖ్య కార్యదర్శి బి.వేణుగోపాల్‌రావు, సీహెచ్ సంపత్‌రావు, అంతటి శంకరయ్య, అడెపు శ్రీనివాస్, కొమురోజు కృష్ణ, ఫిజికల్ డైరెక్టర్ అంతడుపుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి ఖోఖో పోటీలకు భూషణరావుపేట విద్యార్థిని

కథలాపూర్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : యాదాద్రి భవనగిరి జిల్లా పతంగి పాఠశాలలో జరిగిన రాష్ట్రస్థాయి 69వ ఎస్‌జీఎఫ్ క్రీడల్లో మండలంలోని భూషణరావుపేట ఉన్నత పాఠశాల విద్యార్థిని జాతీయస్థాయి శ్రీవర్షిణి ఎంపికైనట్టు ప్రధానోపాధ్యాయుడు నల్ల రాజయ్య తెలిపారు. అండర్ 19 విభాగంలో వచ్చే నెల 20న ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్యలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటుందన్నారు. ఎంపికైన శ్రీవర్షిణిని ఉపాధ్యాయులు, పీఈటీ వాసం నవీన్‌కుమార్ అభినందించారు.

రాష్ట్రస్థాయి కుంగ్‌ఫూ పోటీలు



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న కృష్ణ

కరీంనగర్ స్పోర్ట్స్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రస్థాయి కుంగ్‌ఫూ, కరాటే పోటీల బ్రోచర్‌ను బుధవారం జిల్లా కేంద్రంలోని వాగ్దేవి డిగ్రీ, పీజీ కళాశాల చైర్మన్ గోవిందవరం కృష్ణ ఆవిష్కరించారు. డిసెంబరు 7న వేములవాడలోని మహాలింగేశ్వర గార్డెన్‌లో పోటీలను నిర్వహించనున్నట్లు తెలిపారు. పోటీల నిర్వాహకులు నేరెళ్ల శ్రీధర్‌గౌడ్, రాష్ట్ర కుంగ్‌ఫూ యూనిటీ ఆఫ్ తెలంగాణ బాధ్యుడు అలగందుల శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయులను టెట్ నుంచి మినహాయించాలి

- తపస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వొడ్నాల రాజశేఖర్



నియామక పత్రాలను అందిస్తున్న రాజశేఖర్

సిరిసిల్ల టౌన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయులను టెట్ అర్హత పరీక్ష నుంచి ప్రభుత్వం మినహాయించాలని తపస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వొడ్నాల రాజశేఖర్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో తపస్ జిల్లా సమావేశం జరిగింది. తపస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజశేఖర్ ఎన్నికల అధికారిగా వ్యవహరించి జిల్లాలోని 13 మండలాల అధ్యక్ష, కార్యదర్శుల పదవులకు ఎన్నికలను నిర్వహించగా సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం నూతన అధ్యక్ష, కార్యదర్శులకు నియామక పత్రాలను అందజేసి వారితో ప్రమాణస్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2010 ఆగస్టు 23 కంటే ముందు నియామకమైన ఉపాధ్యాయులకు టెట్ అర్హత పరీక్ష నుంచి మినహాయించాలని అన్నారు. ఆదే విధంగా సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి ఓపీఎస్‌ను పునరుద్ధరించాలని, 51 శాతం ఫిట్మెంట్‌తో పీఆర్సీని ప్రకటించాలని అన్నారు. కార్యక్రమంలో తపస్ జిల్లా అధ్యక్షుడు గసికంటి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి లెంకల జయకృష్ణారెడ్డి, జోనాల్ ఇన్‌చార్జిలు గడ్డం మైపాల్‌రెడ్డి, కమ్మరికుంటు సుధాకర్ పాల్గొన్నారు.

బీసీలను మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం



సమావేశంలో మాట్లాడుతున్న బీసీ సంఘ నాయకులు

గణేశ్‌నగర్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్‌ను తీవ్రంగా ఖండిస్తున్నామని, 42 శాతం రిజర్వేషన్ హామీపై కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలను మోసం చేసిందని తెలంగాణ బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పెంట అజయ్ అన్నారు. బుధవారం ఉమ్మడి జిల్లా స్థాయి కార్యకర్తలతో నగరంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌లో స్పష్టంగా హామీ ఇచ్చిన 42బీసీ రిజర్వేషన్లు అమలు చేయకుండా ఎన్నికలకు వెళ్లడం రేవంత్ రెడ్డి ప్రభుత్వం బీసీలపై చూపుతున్న నిర్లక్ష్యమన్నారు. బీసీలను ఓటు బ్యాంక్‌గా చేసుకొని ఎన్నికల సమయంలో 42 రిజర్వేషన్ ఇస్తామని చెప్పిన కాంగ్రెస్ పార్టీ, అధికారంలోకి రాగానే విస్మరించిందన్నారు.

జాతీయ రహదారి పనులపై పెద్దపాపయ్యపల్లిలో ఆందోళన

హుజూరాబాద్‌రూరల్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దపాపయ్యపల్లి మీదుగా వెళ్తున్న జాతీయ రహదారి పనుల వద్ద బుధవారం గ్రామస్థులు ఆందోళనకు దిగారు. ఆందోళన విషయం తెలుసుకున్న సీఐ కరుణాకర్ ఘటన స్థలానికి చేరుకున్నారు. గ్రామంలో ప్రధాన రహదారి పక్కన సర్వీసు రోడ్డు లేకపోవడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, దీనికి తోడు కాలువల్లో మురుగునీరు నిలిచి అవస్థలు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై సీఐ రోడ్డు కంపెనీ ప్రతినిధులతో మాట్లాడారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా వెటనే చర్యలు తీసుకోవాలని కోరారు. రోడ్డు పనులకు ఆటంకం కలిగించవద్దని గ్రామస్థులను కోరారు.

పాఠశాలల ఆకస్మిక తనిఖీ



విద్యార్థులతో మాట్లడుతున్న ఎస్‌సిఆర్‌టి పరిశీలకురాలు చందన

తంగళ్లపల్లి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): తంగళ్లపల్లి మండలంలోని నేరెళ్ల, బద్దనపల్లి, తంగళ్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను ఎస్‌సిఆర్‌టి రాష్ట్ర పరిశీలకురాలు చందన బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ లర్నింగ్ నడుస్తున్న బద్దనపల్లి ప్రాథమిక పాఠశాలతో పాటు తంగళ్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. తరగతి గదులను పరిశీలించి, టీచింగ్ డైరీస్, బేస్ లైన్ మీట్ లైన్ ఎగ్జామ్స్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. నేరెళ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉదయం ప్రార్థన సమయానికి హాజరై ఉపాధ్యాయుల హాజరు తదితర అంశాలను పరిశీలించారు.

జీవితంపై విరక్తితో యువకుడి ఆత్మహత్య



రామ్‌కిరణ్ (ఫైల్)

కాజీపేట, నవంబరు 26 (ఆంధ్ర జ్యోతి): జీవితంపై విరక్తితో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన కాజీపేటలో జరిగింది. కాజీపేట ఇన్‌స్పెక్టర్ తెలిపిన వివరాల ప్రకారం... కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలం లింగాపూర్ గ్రామానికి చెందిన గుర్రం శ్రీనివా్‌సకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమారుడు గుర్రం రామ్‌కిరణ్(24) కాజీపేట రైల్వేస్టేషన్‌లో అప్రెంటీస్ చేస్తూ స్థానికబాపూజీనగర్‌లో స్నేహితులతో కలిసి అద్దెకు ఉంటున్నాడు. కాగా, కొంతకాలంగా రామ్‌కిరణ్ మానసికంగా ఒత్తిడికి లోనవుతున్నాడు. ఈ క్రమంలో మంగళవారం రాత్రి భోజనం చేసి నిద్రపోయాడు. ఉదయం చూసే సరికి రూంలో ఉరి వేసుకొని మృతి చెంది ఉన్నాడు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

సర్పంచ్‌గా పోటీ చేయాలంటే..

మీకు తెలుసా

చందుర్తి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): సర్పంచ్‌గా పోటీ చేయాలనుకునే వారు నిబంధనలు పాటించాల్సి ఉంటుంది.

- ఎన్నికల్లో నామినేషన్ వేసే వ్యక్తులు 21 సంవత్సరాల వయస్సు నిండి ఉండాలి. అభ్యర్థి ప్రతిపాదకుడు సంతకం చేసిన నామినేషన్ ఉదయం 10.30 నుంచి 5 గంటల లోపు సమర్పించాలి.
- ప్రతిపాదకుడు కచ్చితంగా సంబంధిత వార్డు ఓటర్ లిస్టులో నమోదై ఉండాలి. అభ్యర్థి ప్రతిపాదకుడు ఇంటి టాక్స్ కట్టి గ్రామ పంచాయతీ నుంచి నో డ్యూ సర్టిఫికెట్ తీసుకోవాలి.
- డిపాజిట్ రుసుము సర్పంచ్ రూ. 2,000, వార్డు అభ్యర్థికి 500. ఎస్సీ, ఎస్టీ, బీసీలు కుల ధ్రువీకరణ ఇవ్వాలి. లేదంటే నామినేషన్ ఫారంలోని పార్ట్-111లో డిప్యూటీ తహసీల్దార్‌తో సంతకం చేయించాలి.
- రిజర్వుడు కేటగిరీ అభ్యర్థుల డిపాజిట్ రుసుము సర్పంచి అభ్యర్థికి రూ. 1000, వార్డు అభ్యర్థికి 250 ఇద్దరు సాక్షుల స్వీయ ధ్రువీకరణ ఇవ్వాలి.
- రిటర్నింగ్ అధికారి సమక్షంలో ఎన్నికల ఖర్చు ఖాతా నిర్వహిస్తానని చెప్పే డిక్లరేషన్‌పై సంతకం చేసి ఇవ్వాలి. అభ్యర్థి తన గుర్తింపు కార్డు కోసం ఫోటోను సమర్పించాలి.
- స్క్రూటినీ రోజున నిర్ణీత సమయానికి రిటర్నింగ్ ఆఫీసర్ ఎదురుగా హాజరు కావాలని ఎన్నికల అసిస్టెంట్ డిస్ట్రిక్ట్ ఎలక్షన్ అథారిటీ రాధ పేర్కొన్నారు.

మత్స్యకారుల కుటుంబాలకు రూ. 20 లక్షలు చెల్లించాలి



సమావేశంలో మాట్లాడుతున్న పిట్టల రవీందర్

సుభాష్‌నగర్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): కేరళ రాష్ట్రంలో అమలు చేస్తున్న విధంగా ప్రమాదవశాత్తు మరణించిన మత్స్యకారుల కుటుంబాలకు రూ. 20 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని తెలంగాణ మత్స్యకారుల సహకార సమాఖ్య మాజీ చైర్మెన్ పిట్టల రవీందర్ అన్నారు. బుధవారం నగరంలోని రెవెన్యూ గార్డెన్‌లో తెలంగాణ రాష్ట్ర మత్స్యకారులు, మత్స్యకార్మికుల 4వ రాష్ట్ర సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోవిడ్ తరువాత దేశవ్యాప్తంగా ఉన్న 4 కోట్ల మత్స్యకారులను ఆదుకునేందుకు కేంద్ర ప్రభుత్వం రూ. 20వేల కోట్లతో ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకాన్ని ప్రారంభించిదని తెలిపారు. ముఖ్యంగా మత్స్యకారుల ఆదాయం రెట్టింపు కోసం ఈ పథకం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారని అన్నారు. అయితే రాష్ట్రంలో సంప్రదాయ మత్స్యకారుల సగటు వార్షికాదాయం రూ. 50వేలు మాత్రమేనని, అంటే నెలకు కేవలం రూ. 4వేలు మాత్రమేనని తెలిపారు. నెలకు 4వేల రూపాయల ఆదాయంతో కుటుంబాన్ని ఎలా పోషిస్తారని ప్రశ్నించారు. అయితే 20వేల కోట్లు ఖర్చు చేశామని చెబుతున్న ప్రభుత్వం అవి ఎవరికి ఇచ్చారో చెప్పాలన్నారు. సమగ్ర కుటుంబ సర్వే ప్రకారం మత్స్యకారుల సగటు ఆదాయం రూ. 8వేలని ప్రభుత్వం చెబుతుందని, ఇది ఎక్కడుందని ప్రశ్నించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ఉపాధిహామీ పథకంలో పనిచేస్తున్న కూలీలకు అందించే మొత్తంతో కూడా సరితూగదన్నారు. మత్స్యకారులు చేపట వేటకు వెళ్ళి ప్రమావశాత్తు చనిపోతే రూ.4 లక్షలు ఇస్తామని కేంద్రం ప్రకటిస్తే, అంతకంటే ఒక లక్ష మొత్తం 5 లక్షలు ఇస్తామని నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటించారని తెలిపారు. అయితే 2018 నుంచి 2023 వరకు 584 మంది మత్స్యకారులు చేపలవేటకు వెళ్లి మరణించారని, వారికి ఇంతవరకు ఒక్కపైసా కూడా ప్రభుత్వ పరంగా అందలేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి చనిపోయిన మత్స్యకారుల కుటుంబాలకు అందచేయాని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. రిజర్వాయర్లల్లో ఫ్లోటింగ్ సోలార్ ఏర్పాటును ప్రభుత్వం విరమించుకోవాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి, జిల్లా అధ్యక్షుడు పిట్టల వెంకటేష్, ప్రధానకార్యదర్శి గణేశ్, గుడికందుల సత్యం, వర్ణ వెంకటరెడ్డి, గీట్ల ముకుందరెడ్డి, పప్పు సదానందం, రమేశ్,యు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కళ్లకు గంతలతో బీసీ యువజన సంఘం నిరసన

గణేశ్‌నగర్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): బీసీ యువజన సంఘం ఆధ్వర్యంలో బుధవారం తెలంగాణ చౌక్‌లో కళ్లకు గంతలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేసుపెద్ది శ్రీధర్ రాజు మాట్లాడతూ కామారెడ్డి డిక్లరేషన్‌లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తామని కాంగ్రెస్ ప్రకటించిందని, కేంద్రంపై ఒత్తిడి తీసుకొచ్చి బీసీ బిల్లును రాజ్యాంగ సవరణ ద్వారా 9వ షెడ్యూల్‌లో చేర్చి చట్టబద్ధత కల్పించే విషయంలో పూర్తిగా విఫలమైందని అన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన వాగ్దానాన్ని నిలబెట్టుకోలేదన్నారు. బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షులు నర్సింగోజు శ్రీనివాస్, జిల్లా కన్వీనర్ రవీంద్రచారి, ఉమా మహేశ్వర్, నరాల శ్రీకాంత్ ఉన్నారు.

ట్రాఫిక్ రూల్స్ పాటించాలి

రాయికల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ రూల్స్‌ను అందరూ పాటించాలని రాయికల్ ఎస్సై సుధీర్ రావు అన్నారు. రాయికల్ పట్టణంలో విస్డమ్ పాఠశాలకు చెందిన 1-5వ తరగతి విద్యార్థులు బుధవారం ట్రాఫిక్ నియమాలు నిబంధలు, ప్రమా దాలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం ట్రాఫిక్ నియమాల ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ నివేదితరెడ్డి పాల్గొన్నారు.

ఐకేపీ సెంటర్‌లో కొనుగోళ్లు పూర్తి

జగిత్యాలరూరల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి):జగిత్యాల రూరల్ మండలం లోని వెల్దుర్తి ఐకేపీ సెంటర్ జిల్లాలోనే వేగంగా కొనుగోళ్లు విజయవంతంగా పూర్తి చేసుకుందని జగిత్యాల మండల ఐకేపీ ఏపీఎం రాజయ్య తెలిపారు. ఈసందర్భంగా ఏపీఎం మాట్లాడుతూ సెంటర్‌లో 190 మంది రైతుల వద్ద నుండి 6,200 క్వింటాళ్ల వరి ధాన్యాన్ని సేకరించి జిల్లాలోనే అన్ని సెంటర్‌ల కంటే ముందుగా కొనుగోళ్లు పూర్తి చేశామన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన కల్పించాలి

జగిత్యాల అర్బన్, నవంబర్ 26 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు ఎయిడ్స్‌పై అవగాహన కల్పించాలని జిల్లా వైద్యాధికారి ప్రమోద్ కుమార్ సూచించారు. డిసెంబర్ 1 ప్రపంచ ఎయిడ్స్‌డేను పురస్కరించుకుని ఏర్పాటు చేసే కార్యక్ర మాల సన్నాహక సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా ఉప వైద్యాధికారి శ్రీనివాస్ పాల్గొన్నారు.

శివాజీ విగ్రహానికి భూమి పూజ

సారంగాపూర్, నవంబర్, 26 (ఆంధ్రజ్యోతి) : మండంలోని పోతారం గ్రామంలో గల మూడు తోవల వద్ద శివాజీ విగ్రహనికి బుధవారం భూమిపూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ డిల్లీ రామరావు, కిరణ్ రావు, మధు, పల్లెర్ల రవి పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక

కథలాపూర్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పోతారంకు చెందిన బీఆర్ఎస్ నాయకుడు, మాజీ ఏఎంసీ డైరెక్టర్ కల్లూరి రమేశ్‌యాదవ్ బుధవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ మేరకు వేములవాడలో ఎమ్మెల్యే, విప్ ఆది శ్రీనివాస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అదేవిధంగా సిరికొండకు చెందిన ముదాం రవి అనే వ్యక్తి పార్టీ తీర్థం పుచ్చుకున్నారు.

వీర జవాన్లకు నివాళి

కథలాపూర్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : ముంబాయిలో పాకిస్థాన్ ఉగ్రమూకలు జవానులపై దాడులు చేయగా వీర మరణం చెందిన సైనికులకు మండలంలోని సిరికొండకు చెందిన యువకులు బుధవారం రాత్రి కొవ్వొత్తులతో నివాళులర్పించారు. కార్యక్రమంలో మల్యాల మారుతి, గాందారి శ్రీనివాస్, కాశోజీ ప్రతాప్, లింగేశ్వర్, వీరేందర్ తదితరులు ఉన్నారు.

నీటి వనరుల గణన

పెగడపల్లి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : పెగడపల్లి మండలంలోని నీటి వనరులను డిజిటల్ పద్దతిలో గణన చేస్తున్నట్లు తహసీల్దార్ ఆనంద్ కుమార్ పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలో దీనికి సంబందించి ఉపాదిహామీ క్షేత్రస్థాయి సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని చెరువులు, కుంటలు, వ్యవసాయ బావులు, ఇతర నీటి వనరులను ప్రత్యక్షంగా సందర్శించి మొబైల్ ఆప్ ద్వారా డిజిటల్ పద్దతిలో గణన చేస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ప్రేమ్‌సాగర్ రావు, సీపీవో సత్యం, డీఎైఎస్‌వోలు సంపత్, రాజేశం తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రాజ్యాంగ దినోత్సవం



జగిత్యాలలో అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

జగిత్యాల అర్బన్, నవంబర్ 26 (ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా రాజ్యాంగ దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. జగిత్యాల పట్టణంలోని తహసీల్ చౌరస్తా వద్ద గల డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి ఎమ్మార్పీఎస్ నాయకులు పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఎస్సీ జిల్లా అధ్యక్షులు దుమాల గంగారాం, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు సురుగు శ్రీనివాస్, బాలె శంకర్, దూమాల రాజ్ కుమార్, బెజ్జంకి సతీష్, బొనగిరి కిషన్ పాల్గొన్నారు.

●**జగిత్యాలరూరల్:** తిప్పన్నపేట గ్రామంలో అంబేద్కర్, మాల మహానాడు సంఘాల ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి నివాళు లర్పించారు. కార్యక్రమంలో మాలమహానాడు సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్, కార్యదర్శి కొమురయ్య, నాయకులు యోహాన్, దాసు పాల్గొన్నారు.

●**కోరుట్ల:** పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంతో పాటు అంబేద్కర్ సంఘ సభ్యుల ఆధ్వర్యంలో భారత రాజ్యాంగ దినోత్సవం నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ రవీందర్ ఆధ్వర్యంలో అంబేద్కర్ చిత్రపటానికి నివాళి అర్పించారు. పట్టణం లోని అంబెద్కర్ విగ్రహనికి అంబేద్కర్, ఎంఆర్‌పీఎస్ నాయకులు నివాళులర్పించారు.

●**ధర్మపురి:** రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఎంఆర్‌పీఎస్ ధర్మపురి మండల అధ్యక్షులు చందోళి శ్రీనివాస్ కోరారు. ఎంఆర్‌పీఎస్ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో దళిత సంఘాల రాష్ట్ర కార్యదర్శి పారుపెల్లి రాజమల్లయ్య పాల్గొన్నారు.

●**రాయికల్:** మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ మనోహర్‌గౌడ్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ వెంకటి పాల్గొన్నారు.

●**కథలాపూర్:** మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహిచి విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ అచ్యుత్‌రాజ్, అధ్యాపకులు పాల్గొన్నారు.

●**మల్యాల:** మల్యాలలో బ్లాక్ చౌరస్తా వద్ద గల అంబెద్కర్ విగ్రహంకు అంబేద్కర్ సంఘ నాయకులు నివాళులు అర్పించారు. మ్యాక లక్ష్మన్, శనిగారపు తిరుపతి, గుడిసె రవి, చిన్నదుర్గయ్య పాల్గొన్నారు

●**కొడిమ్యాల:** మండల కేంద్రంలో అంబేద్కర్ విగ్రహానికి వివిద పార్టీల నాయకులు నివాళుల ర్పించారు. కార్యక్రమంలో అంబే ద్కర్ సంఘం రాష్ట్ర నాయకుడు కొత్తూరి స్వామి, వివిద పార్టీల నాయకులు ప్రసాద్, రవి, ఆనందం, రమేష్, రాజయ్య, సురేష్, వెంకటేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో స్వరూప ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేశారు.

●**పెగడపల్లి:** నామాపూర్‌లో రాజ్యాంగ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. 100వ భారత రాజ్యాంగం పుస్తకాలను ఇండియా రిటైర్డ్ డివిజనల్ మేనేజర్ రామడుగు నారాయణ వివిద గ్రామాలకు చెందిన సంఘం నాయకులకు గ్రామ స్థులకు విద్యార్థులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో దయ్య రాజారాం, యూత్ క్లబ్ అధ్యక్షుడు తుడుముల అనిల్, విష్ణు, ఉప్పులేటి నరేష్ పాల్గొన్నారు.

●**వెల్గటూర్:** ప్రపంచ దేశాలలో భారత రాజ్యాంగం గొప్పదని కుమ్మరిపల్లి మాడల్ స్కూల్ ప్రిన్సిపాల్ కృష్ణప్రసాద్ పేర్కొన్నారు. అంబేద్కర్ చిత్ర పటానికి నివాళిఅర్పించారు.

●**గొల్లపల్లి:** గొల్లపల్లి ఆదర్శ పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల, కేజీబీవీ పాఠశాలలతో పాటు అన్ని గ్రామాల్లోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో, గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో 76వ భారత రాజ్యాంగ దినోత్సవ వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. గొల్లపల్లి మండల కేంద్రంలోని స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద అంబేద్కరిస్ట్ గంగధర మధుసూధన్ ఆధ్వర్యంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు.

ఆయా కార్యక్రమాల్లో ఎంపీడీవో రవీందర్ రావు, ప్రిన్సిపల్ సుంకరి రవి, కళాశాల ప్రిన్సిపాల్ ఏనుగు మల్లయ్య, ప్రత్యేకాదికారి పద్మ, మాజీ వైస్ ఎంపీపీ సత్తయ్య పాల్గొన్నారు.

క్లస్టర్ల వారీగా నామినేషన్ కేంద్రాలు ఏర్పాటు

కోరుట్ల రూరల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : సర్పంచ్ నామినేషన్ల స్వీకరణకు ఐదు క్లస్టర్లుగా కేంద్రాలను ఏర్పాటు చేసి నామినేషన్లను ఎన్నికల అధికారులు స్వీకరించనున్నారు. 15 గ్రామ పంచాయితీలతో పాటు 152 వార్డు సభ్యుల ఎన్నిక కొరకు నామినేషన్ల స్వీకరణకు అధికారులు ఏర్పాటు చేస్తున్నారు. అయిలాపూర్ క్లస్టర్‌లో అయిలా పూర్ మేజర్ గ్రామ పంచాయి సర్పంచ్‌తో పాటు 14 వార్డు సభ్యుల ఎంపిక కోసం నామినేషన్ల స్వీకరణకు పంచాయితీ కార్యాలయంలో కేంద్రంను ఎన్నికల అధికారులు ఏర్పాట్లను చేశారు. యూసుఫ్‌నగర్ క్లస్టర్ పరిధిలోని తిమ్మయ్యపల్లి, యూసుఫ్‌నగర్, ధర్మారం గ్రామల సర్పంచ్ నామినేషన్‌లతో పాటు వార్డు సభ్యుల నామినేషన్లను స్వీకరించడానికి గ్రామ పంచాయితలో కేంద్రంను ఏర్పాటు చేశారు. పైడిమడుగు క్లస్టర్ పరిదిలోని కల్లూర్, సర్పరాజుపూర్, పైడిమడుగు, జోగినిపల్లి గ్రామ సర్పంచ్ వార్డు నంబర్ల నామినేషన్‌ను స్వీకరిస్తారు. మోహన్‌రావు క్లస్టర్ పరిధిలోని మాదాపూర్, చిన్నమెట్‌పల్లి, మోహన్ రావుపేట గ్రామ సర్పంచ్ వార్డు సభ్యుల నామినేషన్లు స్వీకరిస్తారు. గుమ్లాపూర్ క్లస్టర్ పరిధిలోని వెంకటాపూర్, గుమ్లాపూర్, సంగెం, నాగులపేట గ్రామ సర్పంచ్ వార్డు సభ్యుల నామినేషన్ల స్వీకరిస్తారు.

● కథలాపూర్ మండలంలో..

కథలాపూర్: మండలంలో ఆరు నామినేషన్ సెంటర్లు ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపీడీవో శంకర్‌నాయక్ తెలిపారు. అంబారిపేట గ్రామ పంచాయతీలో అంబారిపేట, తుర్తి, కలికోట, తాండ్ర్యా లలో గ్రామపంచాయతీలో తాండ్ర్యాల, ఇప్పపల్లి, పోతారం, కథలాపూర్ గ్రామ పంచాయతీలో కథలాపూర్, సిరికొండ, దూలూరు, భూషణరావుపేట గ్రామపంచాయతీలో భూషణరావుపేట, ఊట్‌పల్లి, పెగ్గెర్ల, దుంపెట గ్రామపంచాయతీలో దుంపెట, చింతకుంట, రాజారాం తండా, పోసానిపేట, బొమ్మెన ప్రాథమిక పాఠశాలలో బొమ్మెన, తక్కళ్ళపల్లి, గంభీర్‌పూర్ గ్రామాలకు చెందిన అభ్యర్థులు నామినేషన్ వేయాలని కోరారు.

● ఇబ్రహీంపట్నం మండలంలో..

ఇబ్రహీంపట్నం: మండలంలోని 17 గ్రామ పంచా యతీలలో 162 వార్డులకు ఎన్నికలు జరగనున్నాయి. మండలంలో నామినేషన్ల స్వీకరణ కొరకు ఐదు క్లస్టర్ల కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇబ్రహీంపట్నం పరిధిలో ఇబ్రహీంపట్నం గ్రామపంచాతీకి సంబంధించిన నామినేషన్లు, వేములకుర్తి క్లస్టర్ పరిధిలో వేములకుర్తి, బర్దిపూర్, మూలరాంపూర్, ఎర్దండి గ్రామ పంచాయతీలు, తిమ్మాపూర్ క్లస్టర్ పరిధిలో గోదుర్, తిమ్మాపూర్, తిమ్మాపూర్ తండా, యామపూర్, ఫకీర్ కొండాపూర్ గ్రామపంచాయతీలు, ఇబ్రహీంపట్నం ఐకేపీ కార్యాలయంలో అమ్మక్కపేట, కేశపూర్, కొత్తూరు గ్రామపంచాయతీలు, వర్షకొండ క్లస్టర్ పరిధిలో వర్షకొండ, కోమటికొండాపూర్, డబ్బా, ఎర్రాపూర్ గ్రామపంచాయతీల నామినేషన్లు స్వీకరిస్తారని ఎంపీడీవో గణేష్ తెలిపారు.

పంచాయతీ ఎన్నికలకు సహకరించాలి

మెట్‌పల్లి రూరల్, నవంబర్ 26 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో జరిగబోయే పంచాయతీ ఎన్నికలను శాంతియుత వాతావరణంలో జరుపుకోవడానికి పార్టీల నాయకులు సహకరించాలని మెట్‌పల్లి ఎంపీడీవో సురేష్ అన్నారు. బుధవారం మెట్‌పల్లి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో వివిధ పార్టీల నాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ మండలంలోని గ్రామాల్లో మొదటి విడుతగా ఎన్నికలను నిర్వహించడం జరుగుతాయన్నారు. ఈనెల 27 నుంచి 29 వరకు నామినేషన్ పత్రాలు తీసుకోవడం జరుగు తుందన్నారు. మండలంలోని 23 గ్రామ పంచాయతీలు, 212 వార్డులకు 8 నామినేషన్ సెంటర్లను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఎంపీవో మహేశ్వర్‌రెడ్డి, సూపర్‌డెంట్ నర్సంహారెడ్డి, పార్టీల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలపై అవగాహన సదస్సు

ధర్మపురి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి మండలంలోని దొనూర్ జడ్పీహెచ్ఎస్, మాడల్‌స్కూల్, పట్టణంలోని జడ్పీహెచ్ఎస్, కేజీబీవీ పాఠశాలలో జిల్లా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో బాల్య వివాహాలపై అవగాహన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో సీతాలక్ష్మి, జిల్లా బాలల పరిరక్షణ విభాగం అధికారి పడాల సురేష్, సోషల్ వర్కర్ గంగాధర్ బాల్య వివాహాల చట్టం 2006, పోక్సో చట్టంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సోషల్ వర్కర్ గంగాధర్, ఐసీడీఎస్ సూపర్ వైజర్ కుసుమ, పాఠశాలల ప్రిన్సిపాల్స్ పద్మ, అరుణ, శ్రీనివాస్, మహేందర్, పాల్గొన్నారు.

నేటి నుంచి దత్తాత్రేయ నవరాత్రోత్సవాలు

ధర్మపురి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలోని శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయం ఆవరణలో గల శ్రీ దత్తాత్రే య స్వామి నవరాత్రోత్సవాలు ఈ నెల 27 నుండి డిసెంబరు 4 వరకు అత్యంత వైభవంగా నిర్వహించడం జరుగుతుంని ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు.

వాహనదారులు జాగ్రత్తలు పాటించాలి

ఇబ్రహీంపట్నం, నవంబరు26 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన నేపథ్యంలో వాహన దారులు తగిన గుర్తింపు పత్రాలతో ప్రయాణించాలని ఎస్‌ఐ అనిల్ తెలిపారు. బుధవారం ఇబ్రహీంపట్నం పోలీస్ పరిధిలోని గండి హనుమాన్ చెక్ పోస్ట్ వద్ద వాహన తనిఖీలు చేపట్టారు.

సర్పంచ్ ఎన్నికల్లో అత్యధిక స్థానాలు గెలవాలి
-ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజయ్

మెట్‌పల్లి టౌన్, నవంబరు26(ఆంధ్రజ్యోతి): రాబోయే సర్పంచ్ ఎన్నికల్లో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు గట్టిగా కష్టపడి అధిక స్థానాలు కైవసం చేసుకోవాలని కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్, జగిత్యాల జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్ రావు అన్నారు. బుధవారం కోరుట్ల నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో కీలక సమావేశం నిర్వహించారు. పార్టీ బలపడే విధానంపై, గ్రామస్థాయి అభివృద్ధి కార్యక్రమాలపై రాబోయే సర్పంచ్ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల విజయం కోసం తీసుకోవాల్సిన వ్యూహా లపై విస్తృతంగా చర్చించారు.

సర్పంచ్ ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు

జగిత్యాలరూరల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు పంచాయితీ కార్యదర్శులు సిద్దంగా ఉండాలని జగిత్యాల రూరల్ ఎంపీడీఓ రమాదేవి అన్నారు. జగిత్యాల రూరల్ మండల పరిషత్ కార్యాలయంలో పంచాయితీ కార్యదర్శులకు ఎన్నికల నియమావళి నిబంధనల గూర్చి సమీక్ష సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీఓ రవిబాబు, పంచాయితీ కార్యదర్శులు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యస్వామి కల్యాణ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే

కథలాపూర్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతకుంటలో బుధవారం తారకేశ్వరస్వామి ఆలయంలో సుబ్రహ్మణ్యస్వామి వల్లిదేవసేన కళ్యాణ మహోత్సవ కార్యక్రమంలో వేములవాడ ఎమ్మెల్యే, విప్ ఆది శ్రీనివాస్ పాల్గొన్నారు. వేద పండితులు ఎమ్మెల్యేకు పూర్ణకుంభంతో స్వాగతం పలకగా స్థానికులు శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మల్లేశ్, బైర దేవ్, సత్యనారాయణ, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కాయితి నాగరాజు, పులి హరిప్రసాద్, వేముల కృష్ణ పాల్గొన్నారు.

కబడ్డీలో విద్యార్థిని ప్రతిభ

రాయికల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి జూనియర్ కబడ్డీ పోటీలకు మండలంలోని రామాజీపేట ఉన్నత పాఠశాల విద్యార్థిని ఎనుగంటి సాహిత్య ఎంపికైంది. ఈ నెల 2 నుంచి 4 వరకు నల్గొండ జిల్లాలో జరిగే జూనియర్ కబడ్డీ పోటీల్లో పాల్గొంటుందని ప్రధానో పాధ్యాయుడు నరేందర్, వ్యాయామ ఉపాధ్యాయుడు ప్రతాప్ రెడ్డి తెలిపారు.

వైభవంగా సుబ్రహ్మణ్య షష్ఠి వేడుకలు



పూజల్లో పాల్గొన్న భక్తులు

జగిత్యాల టౌన్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని సుబ్రమణ్య స్వామి, అయ్యప్ప ఆలయాలలో సుబ్రమణ్య షష్ఠి వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ అయ్యప్ప స్వామి ఆలయంలో భక్తులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయంలో అయ్యప్ప దీక్షా స్వాములతో పాటు భక్తులకు అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ట్రస్టీలు, గురుస్వాములు బండారి లక్మీనారయణ, నీలం దశరథ రెడ్డి, మూనాల కిషన్, మూర కైలాసం పాల్గోన్నారు.

●**మల్యాల:** మల్యాలలోని అయ్యప్ప ఆలయంలో సుబ్రహ్మణ్య షష్ఠి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అయ్యప్ప ఆలయంలో నలబై మంది అయ్యప్ప దీక్షలు స్వీకరించారు.

●**ధర్మపురి:** ధర్మపురి పట్టణంలోని శ్రీ అయ్యప్ప స్వామి ఆలయంలో సుబ్రహ్మణ్య షష్ఠి ప్రత్యేక పూజలు బుధవారం ఘననంగా నిర్వహించారు. గురుస్వామి పెండ్యాల బాలకృష్ణస్వామి ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు గుండి అశ్విన్‌శర్మ శాస్త్రోక్తంగా పంచామృతాలతో ప్రత్యేక అబిషేకాలు, పూజలు నిర్వహించారు. .

●**మెట్‌పల్లి టౌన్:** మెట్‌పల్లి పట్టణంలోని అయ్యప్ప స్వామి ఆలయంలో బుధవారం సుబ్రహ్మణ్యేశ్వర స్వామి షష్ఠి మహోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకల్లో కార్యనిర్వహక అధ్యక్షుడు గంగుల వివేక్, ఆలయ కమిటీ అధ్యక్షుడు దోమటి ప్రవీణ్, ఆలయ గురుస్వామి మంత్రి అంజయ్య పాల్గొన్నారు.

●**కోరుట్ల:** పట్టణంలోని అయ్యప్ప దేవాలయంలో సుబ్రహ్మణ్య స్వామి కళ్యాణంను వైభవంగా నిర్వహించారు. దేవాలయంలోని సుబ్రహ్మణ్య స్వామి మండపంలో స్వామి వారికి పంచామృత అభిషేకం నిర్వహిచారు. పాలెపు రాంశర్మ శర్మ, వినయ్ శర్మ, కార్తిక్ శర్మ మంత్రోత్సరణ మద్య కళ్యాణంను జరిపారు. అయ్యప్ప దీక్ష 154 మంది స్వీకరించారు. దేవాల ప్రంగణంలో ద్వాదశ జ్యోతిర్లింగ సహిత శ్రీ శివాలయ నిర్మాణంకు దేవాలయ శాశ్వత గౌరవాధ్యక్షుడు చిద్రాల నారాయణ గురుస్వామి రూ.5లక్షలు, సుబ్రహ్మణ్య షష్ఠి శాశ్వత అన్నదాతగా నిర్వహించ డానికి గుండేటీ నాగరాజు-రాధ దంపతులు రూ.5లక్షల విరాళం ప్రకటించి అందించారు. వీరిని ఆలయ అభివృద్ధి అధ్యక్షుడు శ్రీనివాస్ ఆధ్వర్యంలో సన్మానించి అభినందించారు.

రేణుకా ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన

మెట్‌పల్లి రూరల్, నవంబరు26 (ఆంధ్రజ్యోతి): మండలం లోని వెల్లుల్ల గ్రామంలోని గౌడ సంఘం అధ్వర్యంలో రేణుకా పుట్ల ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. బుధవారం ఉదయం నుంచి ఆలయంలో అమ్మ వారి గర్తన్యాస, దాతున్యాస బీజన్యాస రత్నంయాస యంత్ర స్థాపన బింబరత్నంయాస, యంత్రస్థాపన దేవ దర్శన, కుంభ దర్శన కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం ప్రతిష్టాపన, అమ్మవారి కల్యాణ మహోత్సవ కార్యక్ర మాన్ని భైవంగా నిర్వహించగా కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్, మాజీ ఎంపీపీ మారు సాయి రెడ్డిలు ప్రత్యేక పూజలు జరిపారు.

దీక్షాదివస్‌ను విజయవంతం చేయాలి

జగిత్యాల టౌన్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): జిల్లా బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నవంబరు 29న నిర్వహించే దీక్షా దివస్‌లో కార్యకర్తలందరు పాల్గోని విజయవంతం చేయాలని జిల్లా బిఆర్ఎస్ అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్ రావు పిలుపునిచ్చారు. దీక్షా దివస్‌ను పురస్క రించుకొని బుధవారం జగిత్యాల జిల్లా కేంద్రంలోని బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలతో సన్నాహక సమావేశం నిర్వహించారు. రాజ్యాంగం దినోత్సవం సందర్భంగా జిల్లా బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో అంబేద్కర్ సేన సభ్యులు జిల్లా అధ్యక్షుడు విద్యాసాగర్ రావు, కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్, మాజి జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత సురేష్‌లకు అంబేద్కర్ సూర్యుడు అనే పుస్తకాన్ని అందజేశారు. ఈ సందర్భంగా విద్యాసాగర్‌రావు మాటా డుతూ భారత రాజ్యాంగాన్ని ఆమో దించిన రోజును స్మరించుకోవాలని, అంబేద్కర్ రాజ్యాంగ రచనలో పొందుపరిచిన అంశాల వల్లనే నేడు పేద, బడుగు, బలహీన, అల్పసంఖ్యాక వర్గాల ప్రజలకు సంక్షేమ ఫలాలు అందుతు న్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజి మార్క్‌ఫెడ్ చైర్మన్ లోక బాపురెడ్డి, అవారి శివకేసరి బాబు, మహిపాల్ రెడ్డి, సమీండ్ల శ్రీనివాస్, అయిల్నేని ఆనంద్ రావు, తుమ్మ గంగాధర్, అనురాధ తదితరులు పాల్గొన్నారు.

నామినేషన్లకు వేళాయె..

(ఐదో పేజీ తరువాయి)

ఎన్నికల షెడ్యూ ల్‌ను ప్రకటించడం, తొలి విడత ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేయ నుండడంతో జిల్లా వ్యాప్తంగా ఎన్నికల ప్రవర్తనా నియ మావళి పకడ్బందీగా అమలులోకి తీసుకొచ్చారు. ఎన్ని కల కోడ్‌ను పకడ్బందీగా అమలు చేయడానికి కలెక్టర్ సత్యప్రసాద్ ఆధ్వర్యంలో 40 ప్రత్యేక అధికార బృందా లు విధులు నిర్వహిస్తున్నాయి. కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశారు. ఎన్నికల కోడ్‌కు సం బంధించిన ఎలాంటి ఫిర్యాదులు వచ్చినా పరిష్కరిం చడానికి అధికారం యంత్రాంగం సిద్ధంగా ఉన్నట్లు అధికారులు ప్రకటించారు.

●గ్రామాల్లో ఎన్నికల సందడి

పంచాయతీ ఎన్నికలతో గ్రామాల్లో సందడి ప్రారంభమైంది. షెడ్యూల్ విడుదల కావడం, నామినేషన్ల పర్వం ప్రారంభం కానుండడంతో ఆశావహులు పోటీకి సిద్ధమవుతున్నారు. ఆపై గ్రామాల్లో ప్రచారం వేడెక్కుతుంది. ఇప్పటికే ఆయా పంచాయతీల్లో సర్పంచ్ స్థానానికి ఎవరెవరు బరిలో ఉంటారు, అందులో ఎవరికి విజయావకాశాలు ఉన్నాయనే అంశంపై పల్లెలో జోరుగా చర్చలు సాగుతున్నాయి.

మహిళలకు వడ్డీ వాపస్
- జిల్లాలోని ఎస్‌హెచ్‌జీలకు రూ.10.69 కోట్లు విడుదల
- మహిళా సంఘాల ఖాతాల్లో జమ చేసిన సర్కారు

జగిత్యాల, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): స్వయం సహాయక సంఘాల మహిళలకు రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీ ఎన్నికలకు ముందు వడ్డీ డబ్బులు వాపస్ చేసింది. వడ్డీలేని రుణాల కింద జిల్లాకు రూ. 10.69 కోట్లు విడుదల చేసింది. ఈ మేరకు గ్రామీణాభివృద్ధి శాఖకు మండలాల వారీగా అందిన వివరాల మేరకు వడ్డీ వాపస్ డబ్బులు జమ చేశారు.అయితే 2024 సెప్టెంబరు నుంచి 2025 జనవరి మాసం వరకు తీసుకునన రుణాలకు సంబంధించిన వడ్డీని ప్రభుత్వం వాపస్ చేసింది. జిల్లా వ్యాప్తంగా 11,825 సంఘాలకు వడ్డీ డబ్బులను గత రెండు రోజులుగా నియోజకవర్గాల వారీగా పంపిణీ చేశారు. ఈ డబ్బులు ముందుగా సంఘాల ఖాతాల్లో జమ చేశారు. తర్వాత ఆయా స్వయం సహాయక సంఘాల మహిళల ఖాతాల్లో జమ చేయనున్నారు. అత్యధికంగా ధర్మపురి అసెంబ్లీ నియోజకవర్గానికి 2.78 కోట్లు విడుదల చేయగా, జగిత్యాల నియోజకవర్గానికి 2.12 కోట్లు, కోరుట్ల నియోజకవర్గానికి రూ. 2.58 కోట్లు, చొప్పదండి నియోజకవర్గానికి రూ. 1.61 కోట్లు, వేములవాడ నియోజకవర్గానికి రూ. 1.59 కోట్లు విడుదల చేసింది.

మహిళలు సద్వినియోగం చేసుకోవాలి
- రఘువరన్, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి

ప్రభుత్వం విడుదల చేసిన వడ్డీ వాపస్ డబ్బులను స్వయం సహాయక సంఘాల మహిళా సభ్యులు సద్వినియోగం చేసుకోవాలి. సంబంధిత డబ్బులను ముందుగా మహిళా సంఘాల ఖాతాల్లో జమ చేయడం జరిగింది. ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు వడ్డీ మాఫీ డబ్బుల పంపిణీ జరిపాము.

'వ్యాపార ప్రణాళికలు సిద్ధం చేయాలి'

జగిత్యాల, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): సహకార సంఘాలు స్థానిక అవసరాల కొరకు వ్యాపార ప్రణాళికలు సిద్ధం చేయాలని జిల్లా సహకార శాఖ అధికారి మనోజ్ కుమార్ అన్నారు. బుధవారం పట్టణంలోని కలెక్టరేట్ కార్యాలయంలో ఎఫ్‌పివోలుగా ఎన్నికైన ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో సహకార శాఖ అధికారులు, వరంగల్ కాకతీయ సహకార శిక్షణ సంస్థ అధికారి డాక్టర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

దేశీయ ఉత్పత్తుల పెంపుతోనే ఆర్థిక వ్యవస్థ వృద్ధి



ఆత్మనిర్భర్ భారత్ ప్రతిజ్ఞ చేస్తున్న నాయకులు

జగిత్యాల అగ్రికల్చర్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): దేశీయ ఉత్పత్తులను తయారు చేసుకోవడం ద్వారా దేశ ఆర్థిక వ్యవస్థ వృద్ధి చెందుతుందని ఆత్మనిర్భర్ భారత్ జిల్లా కన్వీనర్ సదాశివ అన్నారు. జిల్లా కేంద్రంలోని స్థానిక బీఎల్ఎస్ గార్డెన్‌లో భారతీయ జనతాపార్టీ జిల్లాస్థాయి కార్యాల ఆధ్వర్యంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు యాదగిరిబాబు అధ్యక్షతన ఆత్మనిర్భర్ భారత్ పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం స్వదేశీ ఉత్పత్తులను ప్రోత్సహించాలని కార్యకర్తలచే ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఆత్మనిర్భర్, బీజేపీ బాధ్యులు ఎర్ర లక్ష్మీ, కళావతి, నలువాల తిరుపతి, పిల్లి శ్రీనివాస్; భూమిరమణ, జుంబర్తి దివాకర్, గంగారాజం, కవిత, భానుప్రియ, నవీన్‌కుమార్ తో పాటు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

●జిల్లా కేంద్రంలోని జిల్లా పార్టీ కార్యాలయంలో 76 రాజ్యాంగ దినోత్సవ వేడుకలను జిల్లా అధ్యక్షుడు యాదగిరిబాబు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులు అర్పించారు.

ఎన్‌వైసీ జిల్లా కమిటీ సభ్యుడికి అభినందన

జగిత్యాల అగ్రికల్చర్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి):మై భారత్ యూత్ వాలంటీర్స్ జిల్లా కమిటీ సభ్యుడిగా ఎంపికైన దొనికెల నవీన్‌ను బీజేపీ జిల్లా అధ్యక్షుడు యాదగిరిబాబుతో పాటు పార్టీశ్రేణులు అభినందించి శుభాకాంక్షలు తెలుపుతూ శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా నవీన్ మాట్లాడుతూ తనపై అపార నమ్మకంతో తన నియామకానికి సహకరించిన ఎంపి అర్వింద్, బీజేపి రాష్ట్ర నాయకులు సత్యనారాయణరావు, జిల్లా అధ్యక్షుడు యాదగిరిబాబుకు కృతజ్ఞతలు తెలిపారు.

కరపత్రాలు పంపిణీ

కథలాపూర్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): గత పదేళ్ళు పాలించిన బీఆర్ఎస్, ప్రస్తుత అధికార కాంగ్రెస్ పార్టీలు దొంగ హామీలతో ప్రజలను నమ్మించి గద్దెనెక్కారని పేర్కొంటూ బుధవారం మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం బీజేపీ నాయకులు కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మల్యాల మారుతి, జిల్లా కార్యవర్గ సభ్యుడు కథలాపూర్ మహేశ్, వంగరి శాంతారాం, కిషోర్ ఉన్నారు.

ఉపాధిహామీ పనులపై సామాజిక తనిఖీ

మెట్‌పల్లి రూరల్, నవంబర్ 26 (ఆంధ్రజ్యోతి) : మెట్‌పల్లి మండల ప్రజా పరిషత్ కార్యాలయం సమావేశ మందిరంలో ఉపాధిహామీ పథకం 16వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక మంగళవారం ఉదయం నుంచి అర్ధరాత్రి వరకు నిర్వహించారు. 2024 ఏప్రిల్ నుంచి 2025 మార్చి వరకు 23 గ్రామాల్లో నిర్వహించిన పనులపై జరిగిన వివిధ పనులపై బృందాలు వారం రోజులు తనిఖీలు నిర్వహించారు. అడిషనల్ డీఆర్‌డీవో మదన్‌మోహన్ సమక్షంలో సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. మండలంలోని అన్ని పంచాయతీలు కలిపి రూ. 33,369 ఫీల్డ్ అసిస్టెంట్‌కు రూ. 6339 ఇంజినీరింగ్ కన్సల్టెంట్‌లకు రూ.101ల పెనాల్టీ రికవరీకి ఆదేశించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో విజిలెన్స్ అధికారి దేవందర్‌రెడ్డి, అధికారులు కృష్ణరెడ్డి, మల్లికార్జున్, ఎంపీడీవో సురేష్, ఎంపీవో మహేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఫ్లెక్సీల తొలగింపు

మల్యాల, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): గ్రామపంచాయితీ ఎన్నికల నియమావళి అమలులోకి రావడంతో మల్యాల మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాల్లో రాజకీయ పార్టీల ఫ్లెక్సీలను పంచాయితీ అధికారులు తొలగించారు. మండలంలో సర్పంచ్ పదవులకు ఆదివారం నుంచి మూడు రోజుల పాటు నామినేషన్లు ఉండనున్నాయి.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

వెల్గటూర్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై ఉదయ్ కుమార్ సూచించారు. జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఆదేశాల మేరకు మండలం లోని కుమ్మరిపల్లి మోడల్ స్కూల్‌లో బుధవారం పోలీసు కళాబృందం సభ్యులచే విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ కృష్ణప్రసాద్ , అధ్యాపక బృందం, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా మల్లన్న జాతర

కోరుట్ల రూరల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అయిలాపూర్ గ్రామంలో బుధవారం మల్లన్న జాతరవోత్సవం ఘనంగా సాగింది. యాదవ సంప్రదాయం ప్రకారం దేవాల యంలో ప్రత్యేక పూజలను నిర్వహించి పట్నాలను వేసారు. కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ ప్రత్యేక పూజలలో పాల్గొన్నారు.